# దుఆ (ప్రార్థనల) శుభములు

:రచన:

హజ్రత్ మిర్జా గులాం అహ్మద్ ఖాదియానీ
మసీహ్ మౌఊద్, మహ్దీ మాహూద్ అలైహిస్సలాం

ప్రచురణ
నజరాత్ నష్రో ఇషాఅత్ ఖాదియాన్

# దుఆ
# (ప్రార్థన)
# శుభములు

రచన

హజ్రత్ మిర్జా గులాం అహ్మద్ ఖాదియాని

మసీహె మౌఊద్, మహ్దీ మాహూద్ అలైహిస్సలాం

**అనువాదము**

హాఫిజ్ సయ్యద్ రసూల్ నియాజ్

**ప్రచురణ**

నజారత్ నష్రో ఇషాఅత్

సదర్ అన్జుమన్ అహ్మదియ్య ఖాదియాన్

بركات الدعا

| | | |
|---|---|---|
| పుస్తకము పేరు | : | దుఆ (ప్రార్థన) శుభములు |
| కూర్పు | : | హజ్రత్ మిర్జా గులాం అహ్మద్ ఖాదియాని మసీహ్ మౌఊద్, మహ్దీ మాహూద్ అలైహిస్సలాం |
| అనువాదము | : | హాఫిజ్ సయ్యద్ రసూల్ నియాజ్ |
| ముద్రణ | : | 2023 |
| ప్రతులు | : | 250 |
| ముద్రణాలయం | : | ఫజ్లె ఉమర్ ప్రింటింగ్ ప్రెస్ ఖాదియాన్ |
| ప్రచురణ | : | నజారత్ నష్రో ఇషాఅత్ ఖాదియాన్ 143516, జిల్లా: గుర్దాస్పూర్, పంజాబ్, ఇండియా. |

| | |
|---|---|
| Name of Book | : **Dua (Prathana) Shubhamulu (Barakat-Ud-Du'a)** |
| Compiled By | : Hazrat Mirza Ghulam Ahmad Qadiani Alaihissalam |
| First Edition | : 2023 |
| Copies | : 300 |
| Telugu Translation | : Hafiz Syed Rasool Niyaz |
| Printed at | : Fazl-e-Umar Printing Press Qadian |
| Published by | : Nazarat Nashr-o-Isha'at Qadian, 143516 Dist: Gurdaspur Punjab, INDIA |

**ఇతర వివరాలకు సంప్రదించగలరు**

**www.alislam.org**

**www.ahmadiyyamuslimjamaat.in**

# విషయ సూచిక


| క్ర.సం. | శీర్షికలు | పుట |
|---|---|---|
| 1. | తొలి పలుకులు | IV |
| 2. | రచయిత ఫోటో | VII |
| 3. | రచయిత పరిచయం | VIII |
| 4. | పుస్తక పరిచయం | X |
| 5. | ప్రథమ ఉర్దు టైటిల్ | XV |
| 6. | ప్రథమ ఉర్దు టైటిల్ అనువాదము | XVI |
| 7. | మా భవిష్యవాణీని అనీస్ హింద్ మీరఠ్ విమర్శించుట | 1 |
| 9. | సయ్యద్ అహ్మద్ ఖాన్ సి.ఎస్.ఐ.గారి పుస్తకము అద్దుఆ వల్ ఇస్తిజాబతు (ప్రార్థన ఆమోదము) మరియు తహ్రీర్ ఫీ ఉసూలిత్తఫ్సీర్ (పవిత్ర ఖుర్ఆన్ విశ్లేషణ) గురించి అభిప్రాయము | 6 |
| 10. | ప్రభుత్వ అధికారులు, నాయకులు, పాలకులు, ధనికులారా! | 44 |
| 11. | ఆయీనా కమాలాతె ఇస్లాం (పుస్తక) అభిమానులకు సమాచారము | 50 |
| 12. | ప్రకటన పత్రము | 51 |
| 13. | TRANSLATION OF THE VERNACULAR NOTICE ON REVERSE | 55 |

بِسۡمِ اللّٰہِ الرَّحۡمٰنِ الرَّحِیۡمِ

# తొలి పలుకులు

ఇస్లాం ఒక సజీవమైన మతము. ఇది సజీవమైన దేవుని వైపు ప్రజలకు మార్గదర్శనము చేయును. ప్రపంచ మతస్తులను పరిశీలించినచో వారు తమ సందేశహరుల బోధనలను విస్మరించారని చాలా స్పష్టంగా తెలుస్తుంది. తద్వారా వారు తమ సత్య యజమాని అయిన దేవుణ్ణి శాశ్వతమైన లక్షణములు కోల్పోయిన వానిగా భావిస్తున్నారు. వారు వివిధ అపోహలలో బంధీలై యున్నారు. దుర్మార్గము, అన్యారాధన, పాపములలో లీనమైనారు. భావితరాలను కూడ నాస్తిక అంధకార గుండములలో పడవేస్తున్నారు.

ఇస్లాం లాంటి సహజ మతము ద్వారా తన ఉనికిని తెలిపి అల్లాహ్ తఆలా మనపై ఉపకారము చేశాడు. మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఆ గొప్ప ఉనికితో సంభాషించి ప్రపంచమును నాస్తికము నుండి రక్షించి సజీవమైన దేవుని వద్దకు చేర్చిరి.

ఈ కాలములో మరొక్కసారి ప్రజలు నిజమైన దేవుని నుండి దూరమవుతున్నారు. పర మతాల గురించి మాట్లాడేదేమున్నది స్వయంగా ఇస్లాం గుత్తేదారులు సైతం అల్లాహ్ తఆలా తన శాశ్వత గుణములను కోల్పోయినట్లు నిర్ణయించారు. ఇలాంటి ఒక మత విద్యావేత్త సర్ సయ్యద్ అహ్మద్ ఖాన్ విశ్వాసము ప్రకారము దుఆ ఒక ప్రార్థన మాత్రమే, దాని ఫలితంగా ఎలాంటి క్రొత్త మార్పులు సంభవించవు. దుఆ వాస్తవికతను తెలియజేయుటకు  ఈ కాలపు అవతార పురుషులు సయ్యద్నా హజ్రత్ మిర్జా గులాం అహ్మద్ ఖాదియానీ అలైహిస్సలాతు వస్సలాం బరకాతుద్దుఆ

(దుఆ శుభములు) అనే పుస్తకమును రచించినారు. ఇలా ముస్లిములలో పాతుకుపోతున్న ఈ నాస్తిక విశ్వాసమును వారు (అ) సవరించిరి. ఇంకా దేవుని ఉనికి పట్ల నిదర్శనములు, దైవ ఆదేశము اُدْعُوْنِيْٓ اَسْتَجِبْ لَكُمْ ఆధారంగా తమ ఆచరణాత్మక జీవితమును ప్రవేశపెట్టిరి, సర్ సయ్యద్ అహ్మద్ ఖాన్ గారి కాలం చెల్లిన విశ్వాసములను గట్టి నిదర్శనములతో ఖండించిరి.

వారు అలైహిస్సలాం దుఆ ప్రాముఖ్యత, ప్రయోజనము, సారము ను ప్రస్తావించి దైవ ఉనికి నిదర్శనములను ప్రవేశపెట్టారు. అసాధ్యమైన పరిస్థితులలో కూడ దేవుడు తన దాసులకు పరోక్షంగా సహకరిస్తాడు. తద్వారా దుఆ ప్రభావమును ప్రపంచము చూసి ఆశ్చర్యములో మునిగి పోవును. గౌరవనీయ సందేశహరుల జీవితములలో ఇటువంటి దుఆ ఆమోద సంఘటనలు మహిమాన్వితముగా వుంటాయి. అందరికంటే ఎక్కువ ఇటువంటి మహిమలు మన విధేయతార్హులు అయిన మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం జీవితములో దర్శించుటకు మనకు లభించును. వారు (స.అ.స) ఎలా ఒంటరిగా అరబ్ అడవులలో దైవ ఏకత్వ పతాకమును ఎగురవేశారు. ఈ దుఆ ఆయుధముతోనే అల్లాహ్ తఆలా వారికి మహా గొప్ప విజయము ప్రసాదించెను.

వారి సల్లల్లాహు అలైహి వసల్లం సత్య దాసులైన హజ్రత్ మిర్జా గులాం అహ్మద్ ఖాదియానీ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం జీవిత చరిత్రను చదివినచో వారు అలైహిస్సలాం అనుక్షణం దుఆలో గడిపిరని స్పష్టమగుతుంది. వారు దయామయుడైన తన దేవునినే పూర్తిగా నమ్ము కొనిరి. వారొక చోట ఇట్లు తెలిపిరి.


> "దుఆ కేవలం ఒక వృథా, కాలం చెల్లిన విషయమని అవివేకి భావిస్తాడు. వైభవోపేతుడైన దేవుడు దుఆ ద్వారా మాత్రమే తన అన్వేషులపై బహిర్గతమైతాడని, నేను సర్వశక్తిమంతుడనని

వారి హృదయములలో సందేశము వేయునని అతనికి తెలియదు. నమ్మకము కొరకు దాహము, ఆకలి కలిగిన వ్యక్తి ఇట్లు గుర్తుంచుకోవలెను. తన జీవితములో ఆధ్యాత్మిక కాంతిని ఆశించు వ్యకికి ఏకైక మార్గము దుఆయే గలదని, దాని ద్వారనే దేవుడు తన ఉనికిపై నమ్మకము కలిగించును, సర్వ సందేహాలు, అనుమానములను నివృత్తి చేయును."

(అయ్యాముస్సులహ్-రూహాని ఖజాయిన్ సంపుటి 14 పుట 239)

సయ్యిద్నా హజ్రత్ అమీరుల్ మొమినీన్ ఖలీఫతుల్ మసీహిల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ అనుమతితో ఈ అద్భుత పుస్తకమును తెలుగులో అనువదించి ముద్రిస్తున్నాము. గౌ॥ హాఫిజ్ సయ్యద్ రసూల్ నియాజ్ ఇంచార్జి తెలుగు డెస్క్ ఖాదియాన్ దీనిని తెలుగులో అనువదించగా గౌ॥ ముహమ్మద్ లతీఫ్ షరీఫ్ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షులు, రివ్యూ కమిటి అధ్యక్షులు, గౌ॥ ముహమ్మద్ అక్బర్ ఉపసంపాదకులు తెలుగు వార పత్రిక బద్ర్ గారలు పరిశీలించి, ప్రూఫ్ రీడింగ్ చేశారు. ఈ పుస్తక ప్రచురణలో సహకరించిన వారందరికి అల్లాహ్ తఆలా చక్కటి ప్రతిఫలము నొసంగు గాక! ఈ పుస్తకము సత్యాన్వేషులందరికి ఆధ్యాత్మికంగా ప్రయోజనము కలిగించుగాక!

*హాఫిజ్ మఖ్దూమ్ షరీఫ్*
*నాజిర్ నష్రో ఇషాఅత్ ఖాదియాన్*



హజ్రత్ మిర్జా గులాం అహ్మద్ ఖాదియానీ
మసీహ్ మౌవూద్, మహ్దీ మాహూద్
అలైహిస్సలాం

# హజ్రత్ మిర్జా గులాం అహ్మద్ ఖాదియాని అలైహిస్సలాం

## (రచయిత పరిచయం)

హజ్రత్ మిర్జా గులాం అహ్మద్ ఖాదియాని మసీహ్ మౌవూద్, మహ్ది మాహూద్ అలైహిస్సలాం 1835 ఫిబ్రవరి 13వ తేదీన భారత దేశము, పంజాబ్ రాష్ట్రము, జిల్లా గుర్దాస్‌పూర్‌లోని ఒక చిన్న పట్టణము ఖాదియాన్‌లో జన్మించారు. బాల్యము నుండే వారు దైవారాధన, దుఆలు (ప్రార్థనలు), పవిత్ర ఖుర్ఆన్‌తో పాటు ఇతర గ్రంథముల పఠనములో నిమగ్నమై వుండేవారు. అప్పుడు నలు వైపుల నుండి ఇస్లాంపై దాడులు జరుగుతున్నందున దాని దయనీయ స్థితిని చూసి తీవ్ర కలతకు గురయ్యే వారు. ఇస్లాం రక్షణతో పాటు దాని బోధనలను స్వచ్ఛమైన రీతిలో ప్రపంచములో వ్యాపింపజేయుటకు వారు (అ) సుమారు 90 కంటే అధిక పుస్తకములను రచించారు. వేల సంఖ్యలో ఉత్తరములు వ్రాశారు. అనేక ధార్మిక సంభాషణలు, చర్చలు జరిపారు. మానవులకు సృష్టికర్తకు మధ్య సంబంధమేర్పరచు అర్హత గల ధర్మము ఇస్లామ్ మాత్రమే అని, ఇస్లాంను అనుసరించి మానవుడు ప్రవర్తనల పరంగా, ఆధ్యాత్మికంగా ఉన్నత స్థాయికి చేరవచ్చునని వారు (అ) తెలిపారు.

చిన్నతనము నుండే వారు (అ) సత్య, దివ్య స్వప్నములతో పాటు దైవ సంభాషణలతో సత్కరించబడిరి. 1889 మార్చి 23వ తేదీన అల్లాహ్ తఆలా అభీష్టము మేరకు బైఅత్ ప్రతిజ్ఞ పరంపరను ప్రారంభించి ఒక

పవిత్ర సంస్థకు పునాది వేశారు. దైవ సంభాషణలలో క్రమంగా ప్రగతి సంభవించెను. కావున ప్రపంచమంతటా వివిధ నామములతో గుర్తింపు పొందిన ప్రపంచ సంస్కర్త వాగ్దత్త తానేనని అల్లాహ్ తఆలా ఆదేశముతో వారు (అ) ప్రకటించుకొనిరి. హజ్రత్ ముహమ్మద్ ముస్తఫా సల్లల్లాహు అలైహి వసల్లం భవిష్యవాణి ప్రకారము అవతరించవలసిన మసీహ్, మహ్దీ తానేనని కూడ వారు ప్రకటించారు. ఇప్పుడు అహ్మదియ్య సంస్థ ప్రపంచ పటములోని 216 కంటే అధిక దేశములలో స్థిరంగా ఏర్పడినది.

1908 మే 26వ తేదీన వారు (అ) పరమపదించిన తర్వాత పవిత్ర ఖుర్ఆన్, ఇస్లాం స్థాపకులైన హజ్రత్ ముహమ్మద్ ముస్తఫా సల్లల్లాహు అలైహి వసల్లం భవిష్యవాణీల ప్రకారము వారి (అ) అవతరణ లక్ష్యమును పూర్తి చేయుటకు అహ్మదియ్య సంస్థలో ఖిలాఫత్ (ఉత్తరాధికారిత్వ) వ్యవస్థ ప్రారంభమయ్యెను. ప్రస్తుతం మసీహ్ ఐదవ ఖలీఫాగా, అహ్మదియ్య జమాఅత్ (సంస్థ) వర్తమాన ఇమామ్ (అంతర్జాతీయ అధినేత)గా హజ్రత్ మిర్జా మస్రూర్ అహ్మద్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ లండన్ కేంద్రముగా విధులు నిర్వహిస్తున్నారు.

# పుస్తక పరిచయం

## దుఆ (ప్రార్థన) శుభములు

(హజ్రత్ మౌలానా జలాలుద్దీన్ షంస్)

ఈ పుస్తకమును హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం 1893 ఏప్రిల్‌లో రచించినారు. ఇందులో దివంగత సర్ సయ్యద్ అహ్మద్ ఖాన్ పుస్తకములు (1) అద్దుఆవు వల్ఇస్తిజాబతు (2) తహ్రీర్ ఫీ ఉసూలిత్తఫ్సీర్‌పై సమీక్ష చేయబడెను. పవిత్ర ఖుర్ఆన్ స్పష్టమైన సూక్తులు, ముహమ్మదీయ సమాజపు ఏకగ్రీవ ఇస్లామీయ విశ్వాసములకు విరుద్ధంగా సర్ సయ్యద్ అహ్మద్ ఖాన్ కొన్ని ఇస్లామీయ విశ్వాసములకు భావార్థములు చేశారు. ఉదా॥ వారు అక్షర లేదా బాహ్య దివ్యవాణి, దుఆ ఆమోదమును నిరాకరించారు. దేవదూతలు, సువార్తవాణి గురించి హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం తమ పుస్తకము "ఆయినా కమాలాతె ఇస్లాం"లో గట్టి నిదర్శనములు, సువార్తవాణి గురించి గట్టి నిదర్శనములు, తిరుగులేని సాక్ష్యములను చూపి వారి భావాలను రద్దు చేసిరి. దేవదూతల ఉనికి, వారి దినచర్యలతో సహా ఇందులో చర్చించిరి. దీని ఉదాహరణ విద్యావేత్తల పుస్తకములలో లభించదు.

వ్యాకులతను తొలగించి సహనము, స్థిరత్వము లభించుటయే దుఆ వాస్తవికత, ఇదే ప్రార్థన అనివార్య ఫలితమని, ఇదే దుఆ ఆమోద మనబడునని నిరూపించుటకు దివంగత సర్ సయ్యద్ 'అద్దుఆవు

వల్ఇస్తిజాబతు' అనే పుస్తకమును వ్రాశారు. ఎందుకనగా దుఆ ప్రార్థన మూలము, అది లేనిదే ప్రార్థన నిరర్థకమగును, దాని ఆమోదము, దాని ప్రభావము, బాహ్య సువార్తవాణిని నిరాకరించడంతో ఒక లక్ష కంటే అధికమైన దైవ సందేశహరులు, కోట్లాది దైవ మిత్రుల సత్యమును అబద్ధీకరించినట్లగును, వారి అధిక మహిమలు, అద్భుతముల మూలము, చెలిమి దుఆల ఆమోదమే అయినందున హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం దివంగత సర్ సయ్యద్ అహ్మద్ పుస్తకమునకు సమాధానము 'బరకాతుద్దుఆ' నామముతో రచించిరి. ఇందులో వారు వ్రాసిన నిదర్శనములను వివేక, గత పుస్తకముల ఆధారంగా రద్దు చేశారు. బాహ్య సువార్త వాణి, దుఆ ఆమోదము గురించి స్వీయ అనుభవమును ప్రవేశపెట్టారు.

> "సువార్తవాణి రూపంలో దేవుని తరపున నాపై దివ్యవాణి అవతరించినప్పుడు ఒక బాహ్య, గట్టి ప్రభావము పడుతున్నట్లు భావన కలుగునని నేను చూశాను. కొన్ని సార్లు ఈ ప్రభావము ఎంత శక్తివంతముగా వుండుననగా అది నన్ను తన కాంతులలో బంధించు కొనును. తద్వారా నేను దాని వైపు ఎంతగా లాగబడుతాననగా దానిని ఎదురించుటకు నాకు శక్తి వుండదు. ఆ ప్రభావములో నేను స్పష్టమైన, ప్రకాశవంతమైన వాక్కును వింటాను. (సూచనలో ఇట్లు వ్రాయబడి వున్నది. ఇంతే కాక దైవదూతలు కొన్ని సార్లు కనిపిస్తారు. మరికొన్ని సార్లు దైవదూతలు ఈ వాక్కులో పాల్గొంటున్నట్లు తెలుపుతారు. సమాప్తం) సత్యములో వుండే ప్రభావము, వైభవమును దర్శిస్తాను. ఆ వాక్కు కొన్ని సార్లు పరోక్ష విషయములను సూచించును. ఇటువంటి శక్తి, ప్రభావము బయట నుండి వచ్చును. దానితో అల్లాహ్

తఆలా ఉనికికి సాక్ష్యము లభించును. కావున దీనిని నిరాకరించుట ఒక సత్యమును స్పష్టంగా తిరస్కరించుట అగును.”

(బరకాతుద్దుఆ-రూహాని ఖజాయిన్ సంపుటి 6 పుట 26)

ఇంకా ఇట్లనిరి.

“ఎవరైనా ప్రవక్తుత్వ వాణిని నిరాకరిస్తు ఇటు వంటి ఆలోచన పూర్తిగా మీ అపోహ అని అన్నచో అతని నోరు మూయించుటకు అతనికి ఉదాహరణ చూపడం తప్ప మరో నిదర్శనము ఏమున్నది?”

(బరకాతుద్దుఆ-రూహాని ఖజాయిన్ సంపుటి 6 పుట 25)

దుఆ ప్రభావమునకు సాక్ష్యమిచ్చుటకు వారిట్లు వ్రాసిరి.

“ఒక వేళ సయ్యద్ గారు తమ ఈ తప్పుడు అభిప్రాయము పట్ల పశ్చాత్తాపము వ్యక్తపరచకుండా దుఆల ప్రభావము నకు సాక్ష్యము ఏది అని అన్నచో నేను ఇటువంటి తప్పులనే సరిదిద్దుటకు అవతరించబడ్డాను. కనుక నా కొన్ని దుఆలు ఆమోదించక ముందే నేను సయ్యద్ గారికి సమాచారము అందిస్తానని వాగ్దానము చేస్తున్నాను. సమాచారము అందించడమే కాక ముద్రింతును. నా దావా, ప్రకటన నిరూపించబడిన తర్వాత సయ్యద్ గారు ఈ తప్పుడు ఆలోచనను విరమించు కుంటారని ఒప్పు కోవలెను.”

(బరకాతుద్దుఆ-రూహాని ఖజాయిన్ సంపుటి 6 పుట 12)

ఇలాగే ఈ పుస్తకము ముగింపులో వారు అలైహిస్సలాం పండిత్ లేఖ్రామ్ గురించి తమ ఒక ఆమోదిత దుఆను కూడ ప్రస్తావించారు. పారసీక పద్యములో దివంగత సర్ సయ్యద్ అహ్మద్ ఖాన్ గారిని

సంబోధిస్తు ఇట్లు వ్రాసిరి.

(1) దుఆ నిరాకరణకు దుఆతోనే చికిత్స చేయుము. ఎందుకనగా మత్తులో వున్నప్పుడు మద్యపానమునకు మద్యపానము తోనే చికిత్స చేయబడును.

(2) దుఆలలో శక్తి వున్నచో ఆ శక్తిని చూపండని అంటున్న ఓ వ్యక్తి! పరుగెత్తుకుంటు నా వద్దకు రా. నేను సూర్యుని వలె దాని శక్తిని చూపెదను.

(3) జాగ్రత్త! దేవుని శక్తుల రహస్యములను నిరాకరించకుము. ఈ విషయమును ఇక్కడితో వదిలి పెట్టుము. ఆమోదిత దుఆను నా ద్వారా వీక్షించుము.

(బరకాతుద్దుఆ-రూహాని ఖజాయిన్ సంపుటి 6 పుట 33)

కనుక దివంగత సయ్యద్ గారి జీవితములోనే పండిత్ లేఖ్రామ్ వినాశనము గురించి భవిష్యవాణి ప్రకాశిస్తున్న సూర్యుని వలె పూర్తి అయినది. స్వపక్షం, ప్రతి పక్షం అందరు ఈ భవిష్యవాణి పూర్తి అయినట్లు సాక్ష్యమిచ్చారు.

రెండవ పుస్తకము "తహ్‌రీర్ ఫీ ఉసూలిత్తఫ్సీర్"లో దివంగత సర్ సయ్యద్ గారు తమ ప్రతిపక్ష మిత్రునితో తఫ్సీర్ (పవిత్ర ఖుర్ఆన్ విశ్లేషణ) సూత్రములను అడిగిరి. ఈ సేవ కూడ నేను చేస్తానని హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం తెలిపిరి. ఎందుకనగా దారి తప్పిపోయిన వ్యక్తికి దారి చూపుట అందరి కంటే ఎక్కువ బాధ్యత నాదే. తఫ్సీర్ కొరకు వారు అలైహిస్సలాం ఏడు ప్రమాణములను వ్రాసిన తర్వాత సయ్యద్ గారి తఫ్సీర్ అధిక చోట్ల ఈ ఏడు ప్రమాణములకు సరితూగలేదని స్పష్టం చేశారు.

సారాంశమేమనగా దివంగత సర్ సయ్యద్ గారు నాయకత్వం వహిస్తున్న ఈ వర్గము అనుసరిస్తున్న పనికిమాలిన అభిప్రాయములు, బూటకపు ఆలోచనలను హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు

వస్సలాం ఖండించారు. వీరు పశ్చిమ తత్వముతో ప్రభావితమై, పవిత్ర ఖుర్‌ఆన్ సూక్తులను తప్పుడు భావాలతో అనుసరిస్తున్నారు. ఒక రకంగా వారు తమ దృష్టిలో ఇస్లాంను శత్రువుల దాడి నుండి రక్షించుటకు ప్రయత్ని స్తుండిరి. కాని వారు తెలియకుండానే ఇస్లాం మూలమును గొడ్డలితో నరికి వేస్తున్నారు. అందుకే హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం ఒక వైపు ముస్లిములకు వారి తప్పిదములను తెలియజేస్తూనే వారిని హెచ్చరించిరి. రెండవ వైపు ఇస్లాం శత్రువులను ఆధ్యాత్మిక పోటీకి తమకు పోటీగా రావాలని ఆహ్వానించిరి. ఇస్లాం సత్యమును, పవిత్ర ఖుర్‌ఆన్ దైవ శాసనమని వివేకపరమైన ఆధారములు, గత పుస్తకముల ఆధారంగా నిరూపించిరి.

ٹائیٹل بار اوّل

# برکات الدعا

سیّد احمد خان صاحب کے سی ایس آئی

کے خیالات کے رد مین

جسکو مجدد زمان و مسیح دوران مرزا غلام احمدؐ

صاحب نے تالیف کر کے بغرض فائدہ عام

مطبع ریاض ھند قادیان مین باہتمام شیخ

نور احمد صاحب طبع کرا کر بماہ رمضان المبارک

سنہ ۱۳۱۰ شایع کیا

تعداد نسخہ ۱۴۰۰

قیمت فی نسخہ ۳ ـ

(ఉర్దు ప్రథమ టైటిల్ అనువాదము)

# దుఆ (ప్రార్థన)

# శుభములు

**సయ్యద్ అహ్మద్ ఖాన్ సి.ఎస్.ఐ. గారి**

**అభిప్రాయముల ఖండన**

దీనిని ఈ కాలపు ముజద్దిద్ (సంస్కర్త) మసీహ్ మౌవూద్ హజ్రత్ మిర్జా గులాం అహ్మద్ అలైహిస్సలాం గారు రచించి ప్రజల సౌకర్యార్థం రియాజ్ హింద్ ముద్రణాయలము నుండి షేఖ్ నూర్ అహ్మద్ గారి ఆధ్వర్యములో పవిత్ర రమజాన్ మాసము 1310 హిజ్రీలో ప్రచురించినారు.

ఆమోదించబడిన దుఆ ఉదాహరణ

# మా భవిష్యవాణిని

# అనీస్ హింద్ మీరఠ్ విమర్శించుట

నేను లేఖ్రామ్ పిశావరీ ★[1] గురించి ప్రచురించిన భవిష్యవాణిని విమర్శించిన ముద్రిత పత్రిక సంచిక దివి: 25 మార్చి 1893 నాకు అందినది. ఈ సత్యవాక్కు మరికొన్ని పత్రికలకు కూడ మింగుడు పడలేదని నాకు తెలిసినది. వాస్తవానికి ఇలా స్వయంగా వ్యతిరేకుల చేతుల మీదుగా దీని ప్రచారము జరుగుతున్నందుకు నాకు సంతోషము కలుగుతుంది. కావున ప్రస్తుతం విమర్శకు సమాధానంగా నేను కేవలం ఈ క్రింది

★[1] లేఖ్రామ్ పిశావరీ గురించి మరొక సమాచారము:

నేడు క్రీ.శ. 2 ఏప్రిల్ 1893 అనగా 14 రమజాన్ 1310 హిజ్రి తేదీన ఉదయం కొంచెం కునుకు స్థితిలో నేను చూసినదేమనగా నేనొక విశాలమైన గృహములో కూర్చొని వున్నాను. మరికొందరు మిత్రులు కూడ నా దగ్గర వున్నారు. పెద్ద భయంకరమైన ఆకృతి గల వ్యక్తి నా ముందుకు వచ్చి నిలబడెను. అతని ముఖము నుండి రక్తము కారుతుండెను. అతడొక క్రొత్త ప్రాణి, శరీర ఆకృతి గల వ్యక్తి అని నాకు తెలిసినది. అనగా అతడు మానవుడు కాదు. కఠినమైన క్రూరమైన దైవదూత వలె వున్నాడు. అతని భయము ఆవహించినది. నేను అతనిని చూడగానే లేఖ్రామ్ ఎక్కడ అని అతడు నన్ను అడిగెను. మరొక వ్యక్తి పేరు చెప్పి అతడు ఎక్కడు న్నాడని కూడ అడిగెను. ఇతడు లేఖ్రామ్ మరియు మరొక వ్యక్తిని శిక్షించుటకు నియమించబడ్డాడని అప్పుడు నేను అర్థము చేసుకున్నాను. ఆ రెండవ వ్యక్తి ఎవరో నాకు అర్థము కాలేదు. కాని నేను కరపత్రము జారీ చేసిన వ్యక్తులలోని వ్యక్తి అని నాకు ఖచ్చితంగా గుర్తున్నది. నేడు శనివారము. సమయం ఉదయం 4:00 గంటల వుతుంది. సర్వ సంకీర్తనములకు అర్హుడు అల్లాహ్‌యే. **(సమాప్తం)**

విధంగా వ్రాయడం సరిపోతుందని భావిస్తున్నాను. అల్లాహ్ తఆలా ఎలా, ఏ పద్ధతిని ఆశించినాడో అలాగే నేను చేశాను. ఇందులో నా ప్రమేయం ఏమియును లేదు. ఇటువంటి భవిష్యవాణి లాభదాయకము కాదని, ఇందులో సందేహాలు మిగిలిపోతాయనే విమర్శను నేను బాగానే అర్థము చేసుకున్నాను. ఇలా అనడం ముందస్తు చర్య అనబడును. నేను స్వయంగా ఈ విషయమును ఒప్పుకుంటున్నాను. విమర్శకులు భావించినట్లు ఏదో సాధారణ జ్వరము వచ్చి లేదా ఎంతో కొంచెం నొప్పి లేచి లేదా విరోచనాలు వచ్చిన తర్వాత మరల స్వస్థత కలిగినచో దీనిని భవిష్యవాణి అని మనము భావించలేమని నేను ఒప్పుకుంటున్నాను. ఇదొక కుట్ర, మోసమగును. ఎందుకనగా ఇటువంటి వ్యాధులు అందరికి కలుగును. మనమందరము ఎప్పుడో ఒక సారి అనారోగ్యానికి గురవుతూనే వుంటాము. కావున ఇటు వంటి పరిస్థితిలో నేను ప్రస్తావించిన శిక్షకు నిస్సందేహంగా అర్హుడనే. దైవ ప్రకోపముతో కూడిన సంకేతమును చూపించిన భవిష్యవాణి చాలా స్పష్టంగా బహిర్గతమైనప్పుడే అది అల్లాహ్ తఆలా తరపున అని మీరు భావించండి. అసలు వాస్తవము ఏమనగా భవిష్యవాణి గొప్పతనము, వైభవము రెండింటి కొరకు రోజులు, సమయము నిర్ణయించవలసిన అవసరం లేదు. దీని గురించి శిక్ష అవతరించుటకు ఒక వ్యవధి నిర్ణయిస్తే సరిపోతుంది. వాస్తవానికి భవిష్యవాణి ఎంతో అద్భుతంగా బహిర్గతమైనచో అది స్వయంగా ప్రజల మనసులను తన వైపు ఆకర్షించును. ముందస్తుగా హృదయములలో మొలకెత్తు ఈ మొత్తం ఆలోచనలు, ఈ సర్వ విమర్శలు ఎలా మటుమాయమైపోతాయనగా ఒక న్యాయ స్వభావికుడు తక్షణమే తమ అభిప్రాయముల పట్ల పశ్చాత్తాపము వ్యక్తపరచును. ఇంకా (నేను) ఈ విధేయుడు కూడ ప్రకృతి చట్టమునకు లోబడి వున్నాడు. నా తరపున ఈ భవిష్యవాణి కేవలం బూటకమైనచో సంభవించే అవకాశమున్న కొన్ని వ్యాధులను దృష్టియందుంచుకొని అంచనా వేసి ఈ భవిష్యవాణి చేసినచో

ఎవరి గురించి ఈ భవిష్యవాణి చేయబడెనో అతడు కూడ ఇలా చేయ వచ్చును. ఈ అంచనాల ఆధారంగానే నా గురించి కూడ భవిష్యవాణి చేయవచ్చును. నేను అతని కొరకు వ్రాసిన 6 సంవత్సరముల గడువు బదులు అతడు నా కొరకు 10 సంవత్సరముల గడువు వ్రాసినను నేను ఒప్పుకొంటాను. లేఖ్రామ్ వయస్సు ప్రస్తుతం అత్యధికంగా 30 సం॥లు వుండును. అతడొక యువకుడు, దృఢమైన, మంచి ఆరోగ్యముతో వున్న వ్యక్తి. కాని ఈ విధేయుని (నా) వయసు ఇప్పుడు 50 సం॥ల కంటే ఎక్కువే వున్నది. బలహీనునిగా, దీర్ఘ కాల రోగిగా వివిధ రకాల వ్యాధులలో చిక్కుకొని వున్నాడు. అయినను ఈ పోటీలో ఏ మాట దేవుని తరపున గలదో, ఏ మాట దేవుని తరపున కాదో తెలిసిపోవును. ఇటువంటి భవిష్య వాణీలకు ఇప్పుడు కాలం చెల్లినదనే విమర్శకుని మాట ఒక సాధారణ వాక్యము. దీనిని చాలా మంది తరచుగా చెప్తుంటారు. గట్టి, సంపూర్ణ సత్యములను స్వీకరించుటకు నా దృష్టిలో ఇదెంతటి చక్కటి కాలమనగా ఇంతకు ముందు ఇటువంటి కాలముల ఉదాహరణ లభించదు. కాని ఈ కాలములో ఎవరైనా మోసము, కుట్రను దాచి పెట్టలేడు. వాస్తవానికి ఇది సత్కార్యులకు చాలా సంతోషకరమైన సందర్భము. ఎందుకనగా ఎవడైతే మోసమును, సత్యమును గుర్తుపట్టగలడో అతడే సత్యమును హృదయ పూర్వకంగా గౌరవించును. అతడు సంతోషముతో పరుగెత్తి సత్యమును స్వీకరించును. సత్యములో ఎటువంటి ఆకర్షణ వుండుననగా అది ఆమోదించబడుతుంది. ప్రజల తాత ముత్తాతలు స్వీకరించని వందలాది క్రొత్త విషయములను కాలము స్వీకరిస్తున్న విషయము విధితమే. సత్యముల దాహము ఈ కాలమునకు కలుగని యెడల ఎందుకు ఇందులో మహా అద్భుత విప్లవము ప్రారంభమైనది. నిశ్చయముగా ఈ కాలము నిజమైన సత్యములకు శత్రువుగా కాక మిత్రునిగా వున్నది. సాదా మనస్తత్వం గల వ్యక్తుల కాలము చెల్లినది, ఇది తెలివిమంతుల కాలమని అనుట సరికాదు.

ఒక రకంగా ఇది కాలమును నిందించుటయే అగును. అనగా ఈ కాలములో సత్యమును నిజంగానే సత్యముగా పొందినను దానిని అది స్వీకరించదు. నేడు యదార్థముగా ఈ కాలము ఇలాగే వున్నదని నేనెన్నడు ఒప్పుకోను. ఎందుకనగా నా దగ్గరకి వస్తున్న వారు, నా ద్వారా ప్రయోజనము పొందుతున్నవారు వాస్తవానికి విద్యావంతులైన యువకులే వున్నారు. వారిలో కొందరు బి.ఏ., ఏం.ఏ. వరకు చదువుకున్న వారున్నారు. నవ యువకులైన ఈ విద్వాంతులు చాలా ఆనందంగా సత్యమును స్వీకరిస్తున్నట్లు కూడ నేను చూస్తున్నాను. ఇంతవరకే కాదు ఒక క్రొత్త ముస్లిం బృందము అనగా విద్యావంతులైన యూరేషియన్ ఆంగ్లేయులు కొందరు ప్రస్తుతం మద్రాస్ (చెన్నై) లో నివాసముంటున్నారు. మా జమాఅత్ లో ప్రవేశించి సత్యములన్నిటిని విశ్వసిస్తున్నారు. ఒక దైవ చింతన గల వ్యక్తి అర్థము చేసుకొనుటకు అవసరమున్న విషయములన్నిటిని నేను వ్రాశానని భావిస్తున్నాను. నా ఈ వ్యాసముపై ఇష్టమొచ్చినట్లు విమర్శలు చేసే హక్కు ఆర్యులకు గలదు. ఈ విషయమును నేను పట్టించుకోను. ఎందుకనగా ఈ భవిష్యవాణిని పొగుడుట లేదా నిందించుట రెండు సమానమే అని నాకు తెలుసు. ఇది నిజంగానే దేవుని తరపున అయినచో తప్పక భయంకరమైన సంకేతముతో ప్రత్యక్షమగును, ప్రజలను వణికించును. ఇది దేవుని తరపున అని నాకు బాగా తెలుసు. ఇది అతని తరపున కానిచో నా అవమానమునకు కారణమగును. ఇప్పుడు నేను పనికిమాలిన భావములను తెలిపినచో ఇది మరింత అవమానమునకు కారణమగును. సర్వ శక్తులు తన ఆధీనములో గల ప్రాచీన పవిత్ర ఉనికి అయిన దేవుడు ఎన్నడు అసత్యునికి గౌరవము ప్రసాదించడు. లేఖ్రామ్‌తో నాకు ఏదో వ్యక్తిగత శత్రుత్వము గలదనే విషయము పూర్తిగా తప్పు. నాకు వ్యక్తిగతంగా ఎవరితో ఎలాంటి శత్రుత్వము లేదు. వాస్తవానికి అతడు సత్యముతో శత్రుత్వము నెరిపినాడు. సత్యములన్నిటికి చెలిమ

అయిన పరిపూర్ణ, పవిత్ర మహా ప్రవక్తను అతడు అవమానించెను. అందుకే దేవుడు తన ప్రియుని గౌరవ, మర్యాదలను ప్రపంచములో స్థాపించాలని తలచెను.

సన్మార్గమును అనుసరించు వానికి శాంతి, ఆశీస్సులు కలుగుగాక!

بِسۡمِ اللّٰہِ الرَّحۡمٰنِ الرَّحِیۡمِ

نَحۡمَدُہٗ وَنُصَلِّیۡ عَلٰی رَسُوۡلِہِ الۡکَرِیۡمِ

# సయ్యద్ అహ్మద్ ఖాన్ సి.ఎస్.ఐ.గారి పుస్తకము అద్దుఆ వల్ ఇస్తిజాబతు (ప్రార్థన ఆమోదము) మరియు తహ్రీర్ ఫీ ఉసూలిత్తఫ్సీర్ (పవిత్ర ఖుర్ఆన్ విశ్లేషణ) గురించి అభిప్రాయము

(పారసీక పద్య అనువాదము)

(1) తమ తెలివికి బందీ అయిన ఓ వ్యక్తి! తన ఉనికిపై గర్వ పడకుము. ఈ విచిత్రమైన ఆకాశము నీ లాంటి చాలా మందిని తీసుకొస్తుంది.

(2) దేవుని వీధిలో ఇతరులు ప్రవేశించలేరు. ఆకాశము నుండి వచ్చిన వ్యక్తి మాత్రమే ఆ దేవుని రహస్యములను బోధించగలడు.

(3) తనంతట తానే ఖుర్ఆన్‌ను అర్థము చేసుకొనుట ఒక తప్పుడు ఆలోచన. స్వతహాగా దాని అర్థమును తెలుపు వ్యక్తి మలినము, నిర్జీవత్వమును ప్రవేశపెట్టును.

పైన తెలిపిన శీర్షికతో గల పుస్తకములో సయ్యద్ గారు దుఆ (ప్రార్థన) గురించి తమ విశ్వాసము (అభిప్రాయము)ను ఇట్లు తెలిపినారు. దుఆ ఆమోదము అనగా దుఆలో యాచించినది ఇవ్వబడునని అర్థము కాదు. యాచించిన ప్రతిది ఎట్టి పరిస్థితిలోనైనా తప్పకుండా ప్రసాదించినచో రెండు రకాల ఇబ్బందులు ఎదురగును. మొదటి విషయమేమనగా వేలాది

దుఆలు ఎంతో వినయము, వ్యాకులతతో చేయబడుతుంటాయి. కాని అవసరం తీరదు. దీని అర్థమేమనగా దుఆ ఆమోదించబడలేదు. వాస్తవానికి దుఆ ఆమోదించబడునని అల్లాహ్ తఆలా వాగ్దానము చేసెను. రెండవ విషయమేమనగా జరగవలసిన విషయములన్ని నిర్ణయించ బడ్డాయి అలాగే జరగని అంశములు కూడ తీర్మానించ బడ్డాయి. ఆయా ప్రకృతికి విరుద్ధంగా ఏమియును జరగదు. కావున దుఆ చేయుట అనగా తప్పకుండా పూర్తి చేయబడుట అయినచో అల్లాహ్ తఆలా వాగ్దానము

اُدْعُوْنِیْٓ اَسْتَجِبْ لَکُمْ (అల్ ముమిన్:40/61)

ప్రకారము జరగని దుఆలు ఈ కోవకు చెందవు. దీని అర్థమేమనగా ఈ దుఆ ఆమోద సర్వసాధారణ మైన వాగ్దానము అబద్ధమగును. ఎందుకనగా తీర్చబడునని నిర్ణయించ బడిన మేరకు మాత్రమే తీర్చబడును. కాని దుఆ ఆమోద నియమము అన్నిటికి వర్తించును. ఇందులో ఎలాంటి మినహాయింపు లేదు. ఇలాగే ఇవ్వబడవని నిర్ణయించినవి ఎన్నటికి ప్రసాదించబడవని మరికొన్ని సూక్తులు తెలుపుతున్నవి. కాని ఏ దుఆ రద్దు కాదని, దుఆలన్ని ఆమోదించ బడునని మరి కొన్ని సూక్తుల ద్వారా స్పష్టమగుతుంది. ఇంత వరకే కాక అన్ని దుఆలను ఆమోదిస్తానని కూడ అల్లాహ్ తఆలా వాగ్దానము చేశాడని

اُدْعُوْنِیْٓ اَسْتَجِبْ لَکُمْ (అల్ ముమిన్:40/61)

అను ఈ సూక్తితో వివరంగా తెలుస్తుంది. కనుక ఈ వైరుధ్యము, వ్యతిరేక సూక్తులతో మోక్షము లభించాలంటే దుఆ ఆమోదమనగా ప్రార్థన అని భావించక తప్పదు. అనగా దుఆ ఒక ప్రార్థన. అది పూర్తి వినమ్రత, దుఃఖము, బాధతో చేయబడినప్పుడు దానిని ఆమోదిస్తానని అల్లాహ్ తఆలా వాగ్దానము చేసెనని దీని అర్థము. సారాంశమేమనగా దుఆను ఒక ప్రార్థనగా భావించబడి దానికి పుణ్యము లభించుటయే దుఆ ఆమోదము అనబడును. ఇలాగే దైవ నిర్ణయము మేరకు మీకు ఒక వస్తువు

లభించవలసి వున్నచో అనుకోకుండా అందుకు దుఆ కూడ చేయబడినచో ఆ వస్తువు కూడ లభిస్తుంది. కాని అది దుఆతో కాకుండా దైవ నిర్ణయము మేరకు లభిస్తుంది. దుఆ ద్వారా లభించే గొప్ప లాభమేమనగా దుఆ చేస్తున్నప్పుడు దైవ వైభవము, అతని అనంత శక్తి మనసులో ఊహించుకోబడును. ఆ ఊహ ఫలించి వ్యాకులత, ఆందోళనకు కారణమయ్యే ఆలోచనలన్నిటిపై విజయము సాధించును. తద్వారా మానవునికి సహనము, స్థిరత్వము కలుగుతుంది. ఇటువంటి భావము ఏర్పడుట ప్రార్థన అనివార్య ఫలితము. దీనినే దుఆ ఆమోదమని అందురు. ఇంకా సయ్యద్ గారు తమ పుస్తకము చివరలో ఇట్లు వ్రాశారు. దుఆ వాస్తవికత తెలియని వారు, దానిలోని వివేకమును గమనించనివారు అదృష్టములో లేని విషయము లభించదనేది వాస్తవమైనప్పుడు దాని కొరకు దుఆ చేయుట ఎలా లాభదాయకమగును. అదృష్టములో వున్నది దుఆ చేసినను చేయకున్నను తప్పక లభించునని రుజువైనప్పుడు లభించనిది వేలాది దుఆలు చేసినను లభించనప్పుడు దుఆ చేయుట ఒక అనవసర విషయమగునని చెప్పవచ్చును. దీనికి సమాధానంగా సయ్యద్ గారిట్లు తెలిపినారు. ఆపద సమయంలో సహాయమును ఆశించుట మానవుని సహజ ప్రత్యేకత. కావున మానవుడు తన సహజ ప్రత్యేకత వలన దుఆ చేస్తాడు. ఒక విషయము జరుగుతుందా లేదా అనే అంశమును ప్రక్కకు పెడుతు మీకు అవసరమున్న ప్రతీది అల్లాహ్‌తోనే యాచించవలెనని మానవ సహజత్వమునకు బోధించబడెను.

ఈ మొత్తం పుస్తకములోని సారాంశమును మేము పైన వ్రాసినాము. దీనితో రుజువగునది ఏమనగా దుఆ ద్వారా అవసరము తీరదు. లక్ష్యములు నెరవేరుటకు దుఆ ఎలాంటి ప్రభావము చూపదు. దుఆ వలన ఏదో అవసరము తీరుట లేదా లక్ష్యము నెరవేరుట ఉద్ధేశమని ఒక వ్యక్తి దుఆ చేసినచో ఇది వృథా ఆలోచన అగును. అనగా దైవ

నిర్ణయము మేరకు జరగవలసిన దానికి దుఆ అవసరం లేదు. దైవ నిర్ణయం మేరకు జరగని దానికి దుఃఖము, అభ్యర్థన వ్యర్థమగును. దుఆ కేవలం ప్రార్థనకు చెందిన అంశమని, దానిని ప్రాపంచిక పరంగా ఏదేని అవసరము తీరుటకు కారణముగా భావించుట తప్పుడు ఆలోచన అని సయ్యద్ గారి విశ్వాసమని ఈ మొత్తం ఉపన్యాసముతో స్పష్టమైనది.

పవిత్ర ఖుర్ఆన్ సూక్తులను అర్థము చేసుకొనుటలో సయ్యద్ గారు తీవ్ర పొరపాటుకు గురైనారని గుర్తుంచుకోండి. ఈ పొరపాటు వాస్తవము గురించి మేము ఈ పుస్తకము ముగింపులో ప్రస్తావించెదము. కాని ఇప్పుడు మేము చాలా విచారముతో తెలుపునదేమనగా పవిత్ర ఖుర్ఆన్‌ను అర్థము చేసుకొనుట సయ్యద్ గారికి నైపుణ్యత లేదనుకున్నచో ఈ పుస్తకము రచిస్తున్నప్పుడు వారు ప్రకృతి చట్టమును సైతం గమనించ లేదా. వారు దానిని అనుసరిస్తానని ప్రగల్భాలు పలుకుతారు. దానిని వారు అల్లాహ్ తఆలా ఆచరణాత్మక మార్గదర్శనమని, పవిత్ర ఖుర్ఆన్ సూక్ష్మ రహస్యముల విశ్లేషణగా నిర్ణయిస్తారు. ప్రపంచములో ఏదియును మంచి చెడు (తఖ్దీర్) దైవ నిర్ణయమునకు అతీతం కాదు. అయినను ప్రకృతి దానిని పొందుటకు కొన్ని మార్గములు నియమించబడెను. వాటి నిజమైన, సత్యమైన ప్రభావమును ఏ వివేకి నిరాకరించలేడు. ఉదా॥ అదృష్టమును నమ్మికొని చికిత్స చేయించుకొనుట లేక చేయించుకోక పోవడం దుఆ చేయుట లేక దుఆను విడిచిపెట్టినట్లగును. కనుక వైద్య విద్యను పూర్తిగా బూటకమని, సత్యమైన వైద్యుల మందులలో ఎలాంటి ప్రభావము లేదని సయ్యద్ గారు చెప్పగలరా! సయ్యద్ గారు అదృష్టమును విశ్వసిస్తున్నప్పటికి మందులు పనికిరానివి కావని కూడ ఎందుకు ఒప్పుకొంటున్నారు. కావున దీనిని పోలివున్న దేవుని సమానమైన చట్టము లో ఎందుకు వ్యత్యాసము, మోసమును సృష్టిస్తున్నారు. తుర్బద్, సఖ్మోనియ, సెన్నా, పత్తి గింజలను ఒక్క పూట పూర్తి మోతాదులో సేవించిన వెంటనే

అతిసారం నుండి ఉపశమనం లభించును. ఇలాగే సిమ్ముల్ ఫార్ (పాషాణం), బీష్, ఇతర ప్రాణాంతక విషములలో ఎంతటి భయంకర ప్రభావము పెట్టెననగా పూర్తి మోతాదులో వున్న వాటి పాయసం కొన్ని నిమిషాల్లోనే పరలోకానికి పంపించును. వీటికి ఇలాంటి శక్తిని ప్రసాదించుటలో అల్లాహ్ సర్వాధికారి అని, కాని తన పవిత్రులు ఎంతో శ్రద్ధ, దృఢ సంకల్పము, దుఃఖముతో చేసిన దుఆలను కేవలం శవముల వలె వుంచునని, వాటిలో ఇసుమంత ప్రభావము వుండదని సయ్యద్ గారు నమ్ముతున్నారా! దైవ చట్టములో వ్యత్యాసము, దేవుడు తన దాసుల మేలు కొరకు మందులలో పెట్టిన స్వచ్ఛమైన తత్వమును దుఆలలో పెట్టక పోవడం సాధ్యమేనా! కానే కాదు. వాస్తవమేమనగా సయ్యద్ గారికి స్వయంగా దుఆల నిజమైన తత్వము తెలియదు. వాటి గొప్ప ప్రభావముల పట్ల స్వీయ అనుభవము లేదు. వారి ఉదాహరణ ఎట్లున్నదనగా ఒకరు చాలా కాలము వరకు పాత, గడువు ముగిసిన, నిస్సారమైన మందును ఉపయోగించిన తర్వాత దానిని ప్రభావరహితముగా పొంది ఆ మందు నిరుపయోగమైనదని శాశ్వత తీర్పు వెల్లడించెను. విచారము! చాలా విచారము!! సయ్యద్ గారు వృద్ధాప్యమునకు చేరుకున్నారు. కాని ఇప్పటి వరకు ప్రకృతి వ్యవస్థ పరంపర, ఖజా వఖద్ర్ (అదృష్టము) ను ఎందుకు వస్తువులతో జోడించబడెనో, ఈ బాహ్య వస్తువుల, మార్గముల పరంపర పరస్పరం ఎంతగా అనివార్య, పటిష్ట సంబంధములు కలిగివున్నదో వారికి తెలియలేదు. అందుకే వారు మోసపోయారు. ఆధ్యాత్మిక, శారీరక పరంగా ప్రకృతి సృష్టించిన వస్తువులు లేనిదే ఏదేని వస్తువు బహిర్గతము కావచ్చునని వారు భావించారు. గమనించినచో ప్రపంచములో ఏదియును ప్రకృతి రహితముగా లేదు. ఉదా॥ అగ్ని, నీరు, గాలి, మట్టి, ధాన్యము, మొక్కలు, పశువులు, వృక్షములు మొదలగు వాటితో మానవుడు లబ్ధి పొందు తున్నాడు. ఇవన్నియు ప్రకృతికి లోబడినవే. కాని అల్లాహ్ తఆలా

నిర్ణయించిన ఈ వస్తువులను విడిచి ప్రకృతి విధించిన మార్గమును విస్మరించి శారీరక లేదా ఆధ్యాత్మిక వనరులను ఆశ్రయించకుండానే ఒక వ్యక్తి అవసరము పూర్తి అగునని భావించిన అవివేకి అల్లాహ్ తఆలా వివేకమును అనర్థం చేయదలచినట్లగును. సయ్యద్ గారు స్వయంగా ఎంతో గట్టిగా అంగీకరించిన ప్రభావవంతమైన వస్తువులను అర్థము చేసుకోలేక పోయారని వారి పుస్తకముతో తెలుస్తుంది. వారు ఈ విషయములో కొంచెం హద్దులు దాటినారు. ఉదా॥ అగ్ని ప్రభావము గురించి సయ్యద్ గారితో చర్చించినచో వారెన్నడు నిరాకరించరు. ఎవరైనా దహనం అగునని రాసి పెట్టి వున్నచో అగ్ని లేకుండానే దహనమగునని వారెన్నడు అనలేరు. అగ్ని వలె చీకటిని ప్రకాశవంతము చేయగల, కించపరుస్తు, దౌర్జన్యమునకు పాల్పడుతున్న వ్యక్తి హస్తమును దహనం చేయగల దుఆ ఫలితములను ముస్లింగా వుండి సయ్యద్ గారు ఎలా నిరాకరిస్తున్నారో నాకు ఆశ్చర్యము కలుగుతుంది. దుఆల సమయమున వారికి ప్రకృతి గుర్తుకు వస్తుందా! అగ్ని ప్రస్తావన వచ్చినప్పుడు ప్రకృతిని మరచిపోతారా! ఈ రెండు విషయములు ఒకే కోవకు చెందినవి కావా! ప్రకృతిని విశ్వసించినను ప్రభావము చూపే బాహ్య వస్తువులను వారు నమ్ముతారు. ఈ విషయములో అతిశయోక్తికి పాల్పడినారనే అపనిందకు వారు గురైనారు. వారు నమ్మిన ప్రకృతి చట్టమును దుఆ సమయమున వారెందుకు మరచిపోతున్నారు. తుదకు ఈగలో వున్నంత శక్తి దుఆలో లేదా! కనుక తెలిసిన వాస్తవమేమనగా వారికి ఈ విషయములో అవగాహన లేదు. వారికి స్వీయ అనుభవము లేదు, అనుభవజ్ఞుల సత్సంగము కూడ వారికి ప్రాప్తి కాలేదు.

ఇప్పుడు మేము ప్రజా ప్రయోజనము దృష్ట్యా దుఆ ఆమోద వాస్తవికతను తెలియదలచితిమి. దుఆ ఆమోదము అనేది నిజంగానే దుఆ అంశములోని ఒక శాఖ. మూలమునే అర్థము చేసుకొనని వ్యక్తి

దాని శాఖను అర్థము చేసుకొనుటలో ఇబ్బందులను ఎదుర్కొనును, అపోహలు కలుగుననేది ఒక ప్రాథమిక సూత్రము. సయ్యద్ గారు ఇదే కారణముతో అపోహలకు గురైరి. దుఆ వాస్తవికత ఏమనగా ఒక పుణ్య దాసునికి అతని దేవునికి మధ్య ఒక ఆకర్షణీయ సంబంధమున్నది. అనగా మొదట దేవుని దయాగుణము దాసుణ్ణి తన వైపు ఆకర్షించును. అనంతరం దాసుని సత్య ఆకర్షణల వలన దేవుడు అతనికి దగ్గరవుతాడు. దుఆ సమయమున ఆ సంబంధము ఒక ప్రత్యేక స్థాయికి చేరుకొని తన ప్రత్యేక లక్షణములను సృష్టించుకొనును. కావున ఎప్పుడేతై దాసుడు ఏదేని కఠిన ఆపదలో చిక్కుకొని సంపూర్ణ నమ్మకము, పరిపూర్ణ ఆశ, పూర్తి అనురాగము, సంపూర్ణ విశ్వసనీయత, నిండు సంకల్పముతో ఎంతో చైతన్యముతో నిర్లక్ష్య ముసుగులను చీల్చుతు త్యాగ మైదానములో వెనక్కి చూడకుండా ముందుకు వెళ్లినప్పుడు అచట అల్లాహ్ తఆలా ఆస్థానము కనిపించును. అల్లాహ్‌కు ఎవరు సాటి లేరు. అప్పుడు అతని ఆత్మ అల్లాహ్ ఆస్థానముపై సాష్టాంగము చేయును. అతనిలో పెట్టబడిన ఆకర్షణీయ శక్తి అల్లాహ్ తఆలా అనుగ్రహములను తన వైపు ఆకర్షించును. అప్పుడు అల్లాహ్ తఆలా అతని అవసరమును తీర్చుటకు దృష్టి సారించును. ఇలా ఆ దుఆల ప్రభావము ఈ అవసరమును పూర్తి చేయుటకు అనివార్యమైన వస్తువులు, మార్గములన్నిటిపై పడును. ఉదా॥ వర్షము కొరకు దుఆ చేయబడినచో దుఆ తర్వాత వర్షము కొరకు అనివార్యమైన ఆ సహజ వస్తువులు, కారణములన్నియు ఆ దుఆ ప్రభావము వలన ఏర్పడును. ఇలాగే కరువు కొరకు శాపముతో కూడిన దుఆ చేసినచో సర్వశక్తిమంతుడైన అల్లాహ్ అందుకు ప్రతికూల కారణములను సృష్టిస్తాడు. అందుకే పరిపూర్ణ వ్యక్తి దుఆలో పని జరిగే శక్తి ఏర్పడుతుందని దివ్యస్వప్నములు, పరిపూర్ణత గల వ్యక్తుల దృష్టిలో పెద్ద పెద్ద అనుభవము లతో రుజువైనది. అనగా అల్లాహ్ తఆలా ఆదేశముతో ఈ భూమ్యా

కాశములో చెలామణి అగును. ఇలా భూమ్యాకాశ శక్తులు, మానవుల హృదయములను ఎటు అవసరముండునో అటు వైపు ఆకర్షించును. దైవ పవిత్ర గ్రంథములలో దీనికి సంబంధించిన ఉదాహరణలు తక్కువేమి లేవు. వాస్తవానికి మహిమలోని కొన్ని రకముల యదార్థము కూడ దుఆ ఆమోదమే. సందేశహరుల ద్వారా వెలువడిన వేలాది మహిమలు లేదా గౌరవనీయ దైవ మిత్రులు ఇప్పటి వరకు ప్రదర్శిస్తున్న గొప్ప అద్భుతాలకు మూలము, చెలిమ ఇదే దుఆ. అత్యధికంగా దుఆల ప్రభావము వల్లనే వివిధ రకాల దైవ ప్రకృతి అద్భుతాలను చూపిస్తుంది. అరేబియా ఎడారుల్లో ఒక విచిత్ర సంఘటన జరిగింది. వందల, వేల సంఖ్యలో మృతులు తిరిగి కొన్ని రోజులలోనే పునర్జీవితులైనారు. తరతరాల నుంచి అవినీతి పరులైన వారికి దివ్యమైన రూపం లభించింది. అంధులు తిరిగి చూడగలిగి నారు. మూగవారి నాలుకల నుంచి దైవజ్ఞానం వెలువడింది. ప్రపంచంలో ఇలాంటి విప్లవాన్ని ఇంత వరకు ఏ కన్నూ చూడలేదు. ఏ చెవీ వినలేదు. ఈ విచిత్రం మీకు తెలుసునా? ఇదంతా కటిక చీకటిలో ఒకడు చేసిన ప్రార్థనల వల్ల జరిగింది. అతడు సంపూర్ణముగా దేవుని ధ్యానంలో నిమగ్నుడై ప్రపంచంలో ఒక మహా విప్లవాన్ని తెచ్చి, ఒక నిరక్షరుడు, నిస్సహాయుడు అయిన వ్యక్తికి ఈ అద్భుత చర్య అసాధ్యమైనను అతడు దీన్ని సాధించినాడు.

اَللّٰهُمَّ صَلِّ وَسَلِّمْ وَبَارِكْ عَلَيْهِ وَاٰلِهٖ بِعَدَدِ هَمِّهٖ وَغَمِّهٖ وَحُزْنِهٖ لِهٰذِهِ الْاُمَّةِ وَاَنْزِلْ
عَلَيْهِ اَنْوَارَ رَحْمَتِكَ اِلَى الْاَبَدِ

అనగా ఓ అల్లాహ్! అతనికి శాంతిని, ఆశీస్సులు ప్రసాదించుము. అతని అనుయాయులను అనుగ్రహించుము. తన ముస్లిం ప్రజల కోసం కష్టాలను భరించిన ఆ ప్రవక్తపై నీ దయా జ్యోతిస్సులను సదా వర్షింపుము.

దుఆల ప్రభావము నీరు, అగ్ని ప్రభావము కంటే కూడ చాలా

ఎక్కువని నేను స్వయంగా చూస్తున్నాను. వాస్తవానికి సహజ కారణముల పరంపరలో దుఆలో గల అద్భుత ప్రభావము లేనే లేదు.

కొన్ని దుఆలు పూర్తి కావు, వారి ప్రభావము ఏమాత్రం తెలియదనే అపోహ కలిగినచో ఇదే పరిస్థితి మందులకు కూడ తప్పదని నేను చెప్తున్నాను. మందులు మృత్యువు ద్వారమును మూసివేసినావా? లేదా అవి పనిచేయక పోవడం అసంభవమా? ఇలా జరిగినను ఎవరైనా వాటి ప్రభావమును నిరాకరించగలరా? ప్రతి విషయములో దైవ నిర్ణయము అవహించివున్నదనుట సత్యమే. కాని దైవ నిర్ణయము జ్ఞానములను వృథా లేదా అవమానపర్చలేదు. ఉదా॥ ఒక రోగి అదృష్టము మంచిగున్నచో చికిత్సకు అవసరమున్న కారణములు, వస్తువులు అందుబాటులోకి వచ్చును. అటువంటి స్థితిలో శరీరము కూడ వాటికి స్పందించడానికి సిద్ధముగా వుంటుంది. అప్పుడు ఆ మందు సూటీగా వెళ్లి ప్రభావము చూపుతుంది. ఇదే సూత్రము దుఆకు కూడ వర్తించును. అల్లాహ్ తఆలా ఆ దుఆను ఆమోదించదలచినప్పుడు దుఆ కొరకు అనివార్యమైన కారణములు, నిబంధనలు నిర్ణీత స్థలములో ప్రోగగును. అల్లాహ్ తఆలా తన శారీరక, ఆధ్యాత్మిక వ్యవస్థను ప్రభావములు, ప్రభావితముల ఒకే పరపంరలో సృష్టించినాడు. కాని శారీరక వ్యవస్థను స్వీకరించి ఆధ్యాత్మిక వ్యవస్థను నిరాకరించి సయ్యద్ గారు తీవ్ర తప్పిదానికి పాల్పడ్డారు.

తుదకు నేను తప్పనిసరిగా చెప్పదలచినదేమనగా సయ్యద్ గారు తమ ఈ తప్పిదము పట్ల పశ్చాత్తాపము వ్యక్తపరచకుండా దుఆల ప్రభావముకు సాక్ష్యము ఏదని అన్నచో ఇటువంటి తప్పిదములను తొలగించుటకు నేను నియమించబడ్డాను. కొన్ని దుఆలను ఆమోదించక ముందే సయ్యద్ గారికి తెలియజేస్తానని నేను వాగ్దానము చేస్తున్నాను. సమాచారము అందించడమే కాక ముద్రించెదను. నా ప్రకటన రుజువు అయిన తర్వాత తమ ఈ తప్పుడు ఆలోచనను విరమించు కుంటారని

సయ్యద్ గారు అంగీకరించవలెను.

దుఆలన్నిటిని ఆమోదిస్తానని అల్లాహ్ తఆలా పవిత్ర ఖుర్ఆన్‌లో వాగ్దానము చేశాడని సయ్యద్ గారి మాట. కాని దుఆలన్ని ఆమోదించ బడవు. ఇది వారి తీవ్రమైన అపోహ.

اُدْعُوْنِیْٓ اَسْتَجِبْ لَكُمْ (అల్ ముమిన్:40 /61)

అనగా “నన్ను పిలువుము. నేను మీ ప్రార్థనను ఆలకింతును.

اُدْعُوْنِیْٓ اَسْتَجِبْ لَكُمْ (అల్ ముమిన్:40/61)

అను ఈ సూక్తి వారి ఉద్దేశము నకు ఎలాంటి లాభము చేకూర్చదు. ఎందుకనగా ఈ సూక్తిలో ఈ దుఆ ఒక ఆజ్ఞ రూపంలో ఇవ్వబడినది. దీనికర్థము సాధారణ దుఆలు కాదు. దీనికర్థము మానవునిపై విధించబడిన ప్రార్థన. ఎందుకనగా ఆజ్ఞ అనే వ్యాకరణ విధిగావించిన దానికి ఉపయోగించబడును. దుఆలన్ని విధిలో పరిగణించబడవను విషయము విధితమే. ఇన్నా లిల్లాహ్ అనగా మేము అల్లాహ్‌కే అంకితమనే సహనశీలురలను కొన్ని చోట్ల వైభవోపేతుడైన అల్లాహ్ ప్రశంసించెను. ఈ దుఆ తప్పనిసరి ప్రార్థన అని తెలుపుటకు గల పెద్ద సూచన ఏమనగా ఆదేశించి మాత్రమే వదిలి పెట్టక ప్రార్థన అనే పదముతో గుర్తు చేసి అవిధేయత వహించినచో నరకపు హెచ్చరిక దానితో జోడించబడెను. ఇతర దుఆలలో ఈ హెచ్చరిక లేదనే విషయము తెలిసినదే. కొన్ని సార్లు దుఆ అడిగినందుకు కొందరు సందేశహరులు అలైహిముస్సలాతు వస్సలాం దైవ అసంతృప్తికి గురైనారు.

اِنِّیْٓ اَعِظُكَ اَنْ تَكُوْنَ مِنَ الْجٰهِلِیْنَ (హూద్:11/47)

అనగా అజ్ఞానుల వలె ఎన్నడు కార్యములు చేయకుమని నీకు నేను ఉపదేశిస్తున్నాను. అను సూక్తి ఇందుకు సాక్ష్యముగా గలదు. ప్రతి దుఆ ప్రార్థన అయినచో హజ్రత్ నూహ్ అలైహిస్సలాం لَا تَسْـَٔلْنِ అనగా ప్రశ్నించకుము అని ఎందుకు హెచ్చరించ బడేవారు. కొన్ని సార్లు దైవ

మిత్రులు,ప్రవక్తలు దుఆ చేయుటను అమర్యాద గా భావిస్తారు. ఇటువంటి దుఆల గురించి సత్యమూర్తులు మొదట ఆత్మ పరిశీలన చేసుకొనుమనే సూత్రమును పాటించారు. అనగా ఆపద సమయ ములో దుఆ చేయాలని మనసు తీర్పునిచ్చినచో దుఆ చేసిరి. కాని సహనము కొరకు సూచించినచో సహనము వహించి, దుఆను విడిచి పెట్టిరి. ఇంతేకాక అల్లాహ్ తఆలా ఇతర దుఆలను ఆమోదిస్తానని స్పష్టంగా వాగ్దానము చేయలేదు. ఇష్టమున్నచో ఆమోదించెదను ఇష్టము లేకున్నచో ఆమోదించ నని స్పష్టంగా తెలిపెను. ఈ విషయమును స్పష్టంగా తెలుపుతున్న సూక్తి పవిత్ర ఖుర్ఆన్ లో ఇట్లు గలదు.

بَلْ اِيَّاهُ تَدْعُوْنَ فَيَكْشِفُ مَا تَدْعُوْنَ اِلَيْهِ اِنْ شَآءَ (అల్ అన్ఆమ్:6/42)
అనగా కాదు! మీరు అతనినే పిలుతురు. అతడు కోరినచో, మీరు ఏ (ఆపద నివారణ) కొరకు (అతనిని) పిలుతురో దానిని తప్పక నివారించును. సరే మనము ఏదో ఒక రకంగా ఇచట పిలువుము అను పదమునకు అర్థము దుఆ అని భావించినను దాని భావము పూర్తి నియమ నిబంధనలతో చేయబడు దుఆ అని ఒప్పుకోక తప్పదు. కరుణామ యుడైన అల్లాహ్ తఆలా అనుగ్రహము సహకరించనిదే నియమ నిబంధ నలన్నిటిని సమకూర్చుకొనుట మానవునికి సాధ్యము కాదు. దుఆ చేయుటలో కేవలం దుఃఖము మాత్రమే సరిపోదు. నిష్టాపరత, పవిత్రత, సత్యము, సంపూర్ణ నమ్మకము, పరిపూర్ణ అభిమానము, పూర్తి శ్రద్ధతో పాటు తన కొరకు దుఆ చేసినను ఇతరుల కొరకు దుఆ చేసినను ఇహ పరలోక పరంగా అతనికి ఈ దుఆ ఆమోదించుట ఎలాంటి నష్టము కలిగించకూడదు. ఎందుకనగా కొన్నిసార్లు దుఆలో ఇతర నియమ నిబంధనలు సమకూరినను ఎవరి కొరకు దుఆ చేయబడెనో అది అతనికి లభించుట మేలు కలిగించక నష్టము కలిగించినట్టిదై వుండును. ఉదా॥ ఒక తల్లి ముద్దుల బిడ్డ ఎంతో దుఃఖము, ఏడుస్తూ అగ్ని రవ్వ లేదా సర్పము తన

చేతికి ఇవ్వాలని లేదా బాహ్యముగా అందముగా కనిపిస్తున్న విషము తనకు తినిపించాలని కోరినచో ఆ తల్లి తన బిడ్డ ఈ కోరికను ఎన్నడు తీర్చదు. ఒక వేళ పూర్తి చేసినచో దైవికముగా బాలుడు ప్రాణాలతో వున్నను తర్వాత అతని ఏదో అవయవము నిరుపయోగంగా మారును. యుక్త వయసుకు చేరిన తర్వాత ఆ బాలుడు తన పిచ్చి తల్లిపై తీవ్రమైన ఫిర్యాదు చేయును. ఇంతే కాక ఇంకా అనేక షరతులు వున్నాయి. అవన్ని ఏకము కానంత వరకు ఆ దుఆను దుఆ అనలేము. దుఆలో పూర్తి ఆధ్యాత్మికత చేరనంత వరకు, ఎవరి కొరకైతే దుఆ చేయబడెనో అతనిలో దైవ సామీప్య శక్తి ఏర్పడనంత వరకు దుఆ ప్రభావము వెలువడుననే ఆశ సందేహాస్పదమే. దుఆను ఆమోదించుటకు అల్లాహ్ తఆలా కోరనంత వరకు షరతులన్నియు సమకూరవు. పూర్తి శ్రద్ధతో ఉత్సాహ స్థైర్యము కలుగదు. పరలోక అనుగ్రహములు, వరములు, అభిరుచులు, సుఖములు మోక్షముతో పోల్చబడెనని, అవి విశ్వాసము, విశ్వాసపూరిత దుఆల ఫలితమని సయ్యద్ గారు కూడ నమ్ముతారు. కనుక ఒక విశ్వాసుని దుఆలు తమలో ప్రభావము కలిగివుంటాయని, ఆపదలను దూరము చేయుటకు, కోరికలు పూర్తి అగుటకు కారణమైతాయని సయ్యద్ గారికి నమ్మక తప్పదు. ఇవి ఫలించనప్పుడు ప్రళయ దినమున ఎలా ఫలిస్తాయి. వాస్తవానికి దుఆ ప్రభావరహితమైనచో, ప్రపంచములో ఏదేని ఆపద నుండి రక్షించుటకు ఉపయోగపడనప్పుడు అంతిమ దినమున ఎలా పని చేయునని చాలా బాగా మంచిగా ఆలోచించండి. ఆపదల నుండి మోక్షము లభించుటకు దుఆలలో ఏదేని శక్తి వున్నచో ఈ ప్రపంచములో కూడ ఆ శక్తి పని చేయవలెనని ఇప్పుడు స్పష్టమైనది. తద్వారా మన నమ్మకము పెరుగును, ఆశయము రెట్టింపు అగును. ఇలా పరలోకములో మోక్షము కొరకు మనము మరింత ఉత్సాహముతో దుఆలు చేయుదుము. ఒక వేళ దుఆ ఒక నామమాత్రమైన బిరుదు మాత్రమే అయినచో సయ్యద్

గారి మాట ప్రకారము ఇహలోకములో దుఆ నిష్ప్రయోజనమైనప్పుడు పరలోకములో కూడ ఇది నిష్ప్రయోజనమే అగును. దీనిని నమ్మికొనుట అడియాశ మాత్రమే. ఇక దీని గురించి నేను మరింత వ్రాయదలచు కోలేదు. ఎందునగా పాఠకులు న్యాయముతో నేను సయ్యద్ గారి అపోహ కు పూర్తి సాక్ష్యము ఇచ్చితినా లేదా అని నేను వ్రాసిన ఈ విషయములను శ్రద్ధతో చదివి అర్థము చేసుకోగలరు. ఇప్పటికి సయ్యద్ గారు తమ మొండితనమును వీడకపోయినచో వారికి తిరుగు లేని నిదర్శనములు ఇచ్చుటకు రెండవ పద్ధతి కూడ వ్రాయబడెను. వారు సత్యాన్వేషులైనచో దీని పట్ల విముఖత వహించరు.

ఇలాగే సయ్యద్ గారి రెండవ పుస్తకము పేరు 'తహ్‌రీర్ ఫీ ఉసూలిత్తఫ్సీర్.' వారి మొదటి రచనకు పూర్తిగా వ్యతిరేకము, విరుద్ధంగా వున్నది. ఒక రకంగా సయ్యద్ గారు స్పృహలో లేనప్పుడు ఈ రెండు పుస్తకములను రచించినట్లున్నది. ఎందుకనగా సయ్యద్ గారు దుఆ ఆమోదము కొరకైతే తఖ్దీర్ (అదృష్టము)నకు ప్రాధాన్యతనిస్తారు. రోజువారి కారణములు, వస్తువులను అనవసరంగా భావిస్తారు. ఇదే కారణము వలన వారు దుఆ ఆమోదమును నిరాకరించారు. ఎందుకనగా దుఆ కూడ రోజువారీ కారణములలో ఒకటి. వాస్తవానికి ఒక లక్ష కంటే అధిక ప్రవక్తలు, కోట్లాది దైవ మిత్రుల సాక్ష్యము ఇందుకు కొనసాగుతుంది. ★(2) సందేశహరుల చేతిలో దుఆ తప్ప మరేముండేది. రెండవ రచనలో సయ్యద్ గారు తఖ్దీర్ (దైవ నిర్ణయము)ను శూన్యముగా భావిస్తారు.

★ (2) దైవ మిత్రులు, దైవసన్నిహితుల నాయకులైన సయ్యద్ అబ్దుల్ ఖాదిర్ జీలానీ రజియల్లాహు అన్హు తమ రచన 'ఫుతూహుల్ బయాన్' లో సంపూర్ణ శ్రద్ధ, దుఆ ప్రభావము గురించి తమ అనుభవాల ఫలితంగా వ్రాసిన పంక్తులను ఇచట మేము ప్రజా ప్రయోజనము దృష్ట్యా పొందుపరుస్తున్నాము. దీని అర్థమే మనగా ప్రతి మైదానము గురించి ఆ మైదానములో నిపుణుడైన వ్యక్తి సాక్ష్యమే →

ఎందుకనగా వారు వస్తువులన్నిటిని శాశ్వత ఉనికిగా భావించారు. అనగా ఆయా వస్తువులన్నియు అల్లాహ్ తఆలా ఆధీనములో లేకుండా వెళ్లి పోయాయి. ఇకముందు వాటిలో మార్పులు, చేర్పులకు అతనికి ఎలాంటి అధికారము లేదు. ఒక రకంగా అతని దైవత్వము చాలా పరిమితమైనది. అతని సర్వశక్తి సామర్థ్యములు భవిష్యత్తులో కొనసాగక గతముకే

---

నమ్మదగినది అగును. కావున దుఆ ఆమోద తత్వము గురించి అల్లాహ్ తఆలాతో సత్య సంబంధములు, నిజమైన అభిమానము కలిగి వున్న వ్యక్తికి తెలియును. సయ్యిద్ గారితో ఈ పవిత్ర తత్వము గురించి ప్రశ్నించు ఉదాహరణ ఒక రోగితో మరొక వ్యక్తి వ్యాధికి చికిత్స అడుగుట అగును. తమ పౌరులైన ప్రజలతో ప్రాపంచిక ప్రభుత్వ సంప్రదింపుల గురించి సయ్యిద్ గారు చర్చించినచో ఇందుకు వారు నిస్సందేహంగా అర్హులగుదురు. కాని దైవ విషయములు దైవ సంబంధిత వ్యక్తులకే తెలుసు. ఆ పంక్తి ఇట్లు గలదు.

فَاجْعَلْ اَنْتَ جُمْلَتِكَ وَاَجْزَاءَ كَ اَصْنَامًا مَعَ سَائِرِ الْخَلْقِ وَلَا تُطِعْ شَيْئًا مِّنْ ذَالِكَ وَلَا تَتَّبِعْهُ جُمْلَةً فَتَكُوْنَ كِبْرِيْتًا اَحْمَرَ فَلَا تَكَادُ تَرَى فَحِيْنَئِذٍ تَكُوْنُ وَارِثَ كُلِّ نَبِيٍّ وَ رَسُوْلٍ وَ بِكَ تُخْتَمُ الْوِلَايَةُ وَ تَنْكَشِفُ الْكُرُوْبُ وَ بِكَ تَسْقِى الْغُيُوْثُ وَ بِكَ تَنْبُتُ الزُّرُوْعُ وَ بِكَ تُدْفَعُ الْبَلَايَا وَالْمِحَنُ عَنِ الْخَاصِّ وَالْعَامِّ وَ اَهْلِ الثُّغُوْرِ وَ تُقَلِّبُكَ يَدُ الْقُدْرَةِ وَيَدْعُوْكَ لِسَانُ الْاَزَلِ وَتُنْزِلُ مَنَازِلَ مَنْ سَلَفَ مِنْ اُولِى الْعِلْمِ وَ يُرَدُّ عَلَيْكَ التَّكْوِيْنُ وَ خَرْقُ الْعَادَاتِ وَتُؤْمِنُ عَلَى الْاَسْرَارِ وَالْعُلُوْمِ اللَّدُنِيَّةِ وَغَرَائِبِهَا۔

**అనువాదము:** నువ్వు దేవుని ప్రియమైన వ్యక్తిగా మారదలచినచో నీ చేతులు, నీ →

పరిమితమైనవి. వస్తువుల మార్పుల స్థితిలో అతని శక్తి ఏమియును లేదు. ప్రాణులలో గల ఈ మార్పులకు అతీతమైన శక్తి వాటి స్వంత శక్తి. ఎందుకనగా తఖ్దీర్ అనేది గతముకే పరిమితమైనది. ఏ ప్రత్యేకతలలో అల్లాహ్ తఆలా అధికారము మిగలలేదో వాటి ప్రత్యేకతలను అతని శక్తి అని చెప్పగలము. అధికారమున్నచో మార్పునకు కూడ అధికారము గలదని

---

పాదాలు, నీ నాలుక, నీ కండ్లు, నీ ఉనికి మొత్తం, దాని భాగములన్నియు నీ మార్గములో విగ్రహములని నమ్మకముతో అర్థము చేసుకొనుము. ప్రాణులలోని ఇతర వస్తువులన్నియు సైతం నీ మార్గములో విగ్రహములే. నీ పిల్లలు, నీ భార్య, ప్రపంచములోని నువ్వు ఆశిస్తున్న ప్రతి కోరిక, ప్రపంచములోని ధనము, ప్రాపంచిక గౌరవము, ప్రపంచ వైభవము, ప్రపంచ కోరిక, భయము, జైద్, బకర్‌ను నమ్ముట లేదా ఖాలిద్, వలీద్ చే నష్టము వాటిల్లునని భయపడుట ఇవన్ని నా దారిలో విగ్రహములే. కావున ఈ విగ్రహములలోని దేనికి నువ్వు విధేయునిగా మారకుము. మొత్తం దానిని అనుసరిస్తు నాశనము కాకుము. అనగా శాసన నియమ నిబంధనలు, సత్యమూర్తుల పద్ధతులు అనుమతించిన మేరకు తప్ప. నువ్వు ఇలా చేసినచో దేవుని ఆస్థానములో గౌరవము పొందెదవు. నీ స్థాయి చాలా పెరిగిపోవును. తుదకు నువ్వు కనిపించవు. నిన్ను సందేశహరులు, ప్రవక్తలకు వారసునిగా చేయును. అనగా కనుమరుగైన వారి విద్యలు, జ్ఞానములు, శుభములు క్రొత్తగా నీకు అందించబడును. దైవ మిత్రుత్వము నీకు ప్రత్యేకంగా లభించును. అనగా నీ కంటే గొప్ప వారెవరు నీ తర్వాత సిద్ధము కారు. నీ దుఆలు, నీ సంకల్పము, ధైర్యము, నీ శుభము వలన ప్రజల తీవ్ర ఇబ్బందులు దూరము చేయబడును. కరువుతో అల్లాడుతున్న వారికి వర్షము కురిపించబడును. పంటపొలాలు సశ్యశ్యామలగును. ప్రతి సాధారణ, ప్రత్యేక వ్యక్తుల బాధలు, కష్టములే కాక రాజుల ఆపదలు కూడ నీ శ్రద్ధ, దుఆతో దూరము చేయబడును. ఈ శక్తి నీకు తోడుగా వుండును. అది ఎటు ముఖము త్రిప్పునో అటు నువ్వు త్రిప్పబడుదువు. ఆది శక్తి నిన్ను తన వైపు ఆహ్వానించును. అనగా నీ నాలుక ద్వారా వెలువడే పదములు అల్లాహ్ తఆలా వైపున వెలువడును. ఇందులో శుభము కలిగించబడును. నీ కంటే పూర్వము జ్ఞానము ప్రసాదించబడిన సత్యమూర్తులందరికి ఉత్తరాధికారిగా నువ్వు నిలిచెదవు.

నమ్మవలసి వుండును. సారాంశమేమనగా సయ్యద్ గారు ఈ రెండవ రచన లో నిజమైన శక్తిమంతుడైన అల్లాహ్ అధికారము నుండి వస్తువులన్నిటిని మినహాయించిరి. తద్వారా (సయ్యద్ గారి మాటలో) అవి తమ ప్రత్యేకతల లో యజమాని అయిన అల్లాహ్హాధీనములో లేవు. ఇందుకు భిన్నంగా వ్యవసాయదారుల ఐదవ చట్టం ప్రకారము ఆంగ్లేయులు వారసుదారులకు హక్కులు కల్పించారు. అనగా యజమానికి వారిపై ఎలాంటి అధికార హక్కులు వుండవు. ఇటువంటి వారసత్వమునే వస్తువులన్నిటికి ఉదా॥ అగ్ని మొదలగు వాటికి సయ్యద్ గారు కేటాయించారు. విచారమేమనగా సయ్యద్ గారి చట్టములో ఆంగ్లేయుల చట్టము కంటే మరింత కఠినత్వము గలదు. ఎందుకనగా ఆంగ్లేయులు ఐదవ చట్టంలో వారసత్వ హక్కును తొలగించుటకు కూడ ఒక రకమైన మినహాయింపు పద్ధతిని నిర్ణయించారు. అదేమిటనగా వారసుడు ఒక సంవత్సరం వరకు అనివార్యమైన పన్నులోని ఒక భాగము రెండు ఆనాలు చెల్లించనిచో అతడు హక్కు కోల్పోవును. కాని సయ్యద్ గారు ప్రతి పరిస్థితిలో యాజమాన్య హక్కులకు భంగం కలిగించారు. నిశ్చయముగా ఇదొక పెద్ద దౌర్జన్యమే.

సయ్యద్ గారు తమ మిత్రపక్షమైన స్నేహితునితో పవిత్ర ఖుర్ఆన్ విశ్లేషణ ప్రమాణమును అడిగినారు. కావున ఇచట నేనే సయ్యద్ గారికి ఏదో కొంత మేరకు సహాయము చేయాలని భావించాను. ఎందుకనగా

ప్రతికూలముగా జరగవలెననే ఆదేశము నీ కొరకు రద్దు చేయబడును. అనగా నీ దుఆ, నీ శ్రద్ధ ప్రపంచవ్యాప్తముగా చలామణి అగును. నువ్వు వున్న దానిని లేని దానిగా లేని దానిని వున్న దానిగా చేయదలచినచో అలాగే జరుగును. మహిమాన్విత విషయములు నీ చేత బహిర్గతమగును. దైవ జ్ఞానములు, విచిత్ర విషయములు నీకు అందించబడును. వాటి కొరకు నువ్వు న్యాసకునిగా, అర్హునిగా భావించ బడెదవు. **(సమాప్తం.)**

దారితప్పిన వారికి దారి చూపుట అందరికంటే ఎక్కువ నా బాధ్యతే. కావున వీటిని గుర్తుంచుకోండి.

**(1) మొదటి ప్రమాణము:** నిజమైన విశ్లేషణకు ఖుర్ఆన్ సాక్ష్యములే ప్రామాణికం. తన సత్యములకు సాక్ష్యము లేదా నిదర్శనములకు బయటివాటిపై ఆధారపడుటకు పవిత్ర ఖుర్ఆన్ ఇతర సాధారణ పుస్తకముల వలె కాదని జ్ఞాపకముంచుకోవలెను. అదెంతటి సమగ్రమైన భవనమనగా దాని ఒక్క ఇటుకను కదిలించినా మొత్తం భవనము అందవిహీనంగా మారును. దానిలోని ప్రతి సత్యమునకు కనీసం పది లేదా ఇరవై సాక్ష్యములు స్వయంగా అందులోనే వున్నాయి. కనుక మనము పవిత్ర ఖుర్ఆన్‌లోని ఒక సూక్తికి ఒక అర్థము చేస్తున్నప్పుడు ఆ అర్థములను ధృవీకరిస్తున్న ఇతర సాక్ష్యములు పవిత్ర ఖుర్ఆన్ నుండే లభిస్తున్నాయా లేదా అని గమనించవలెను. కాని ఇతర ధృవీకరణ సాక్ష్యములు లభించ కుండా ఆ అర్థములకు ఇతర సూక్తులు పూర్తిగా భిన్నమైన భావములు తెలుపుతున్నచో ఆ అర్థము మొత్తానికి తప్పు అని నిర్ధారించుకోవలెను. ఎందుకనగా పవిత్ర ఖుర్ఆన్‌లో పరస్పర విభేదముండుట అసాధ్యము. పవిత్ర ఖుర్ఆన్ నుండియే అధిక సంఖ్యలో స్పష్టమైన సాక్ష్యములు ఆయా అర్థమును ధృవీకరించుటయే నిజమైన అర్థములకు సంకేతము.

**(2) రెండవ ప్రమాణము:** దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం విశ్లేషణ. పవిత్ర ఖుర్ఆన్ అర్థమును అందరికంటే ఎక్కువ అర్థము చేసుకునే వారు మన ప్రియమైన ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమని అనుటలో ఎలాంటి సందేహము లేదు. హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం ద్వారా ఏదేని విశ్లేషణ రుజువైనచో నిస్సంకోచంగా, నిర్భయంగా దానిని స్వీకరించ వలెను. లేనిచో అతనిలో అవిశ్వాసము, అర్థరహిత తత్వము వున్నట్లగును.

**(3) మూడవ ప్రమాణము:** అనుచరుల విశ్లేషణ. మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం కాంతిని పొంది, ప్రవక్తుత్వ జ్ఞానమునకు ప్రథమ

వారసులుగా అనుచరులు రిజ్వానుల్లాహ్ అలైహిమ్ నిలిచిరనుటలో ఎలాంటి సందేహం లేదు. అల్లాహ్ తఆలా ప్రత్యేక అనుగ్రహము వారికి లభించెను. దైవ సహాయము వారి జ్ఞాన శక్తికి తోడుగా వుండెను. ఎందుకనగా వారు మాటలకే పరిమితం కాక ఆచరించేవారు.

**(4) నాలుగవ ప్రమాణము:** తమ స్వంత పవిత్ర మనసుతో పవిత్ర ఖుర్ఆన్ గురించి గమనించుట. ఎందుకనగా పవిత్ర మనసుతో పవిత్ర ఖుర్ఆన్‌కు ఒక సంబంధముంది. వైభవోపేతుడైన అల్లాహ్ తఆలా ఇట్లనెను.

لَا يَمَسُّهُۥٓ إِلَّا ٱلْمُطَهَّرُونَ (అల్ వాఖిఅహ్:56/80)

దీని (ఖుర్ఆన్) వాస్తవమును, కేవలము పవిత్రులే పొందుదురు. ఎందుకనగా పవిత్ర హృదయము గల మానవునిపై పవిత్ర ఖుర్ఆన్ జ్ఞానములు ప్రత్యేక సంబంధము వలన అవతరించును. అతడు వాటిని గుర్తించి, వాటిని పొందుతాడు. ఇదే సత్యమైన మార్గమని అతని హృదయము సాక్ష్యమిచ్చును. అతని హృదయ కాంతి సత్యమును పరీక్షించుటకు ఒక ఉత్తమ ప్రమాణముగా నిలుచును. మానవుడు ఆచరణకు అలవాటు పడి సందేశహరులు నడిచిన ఇరుకు మార్గములో నడవనంత వరకు అహంకారము, గర్వముతో పవిత్ర ఖుర్ఆన్ విశ్లేషకునిగా అవతారమెత్తకూడదు. లేనిచో అతని విశ్లేషణ మహా ప్రవక్త అలైహిస్సలాం నిషేధించిన విశ్లేషణ అగును. వారు సల్లం ఇట్లనిరి.

مَنْ فَسَّرَ الْقُرْاٰنَ بِرَأْيِهٖ فَاَصَابَ فَقَدْ اَخْطَأَ (తిర్మిజి, కితాబుల్ ఇల్మ్)

అనగా కేవలం తన స్వంత ఆలోచనతో ఖుర్ఆన్ విశ్లేషణ చేసిన వ్యక్తి తమ దృష్టిలో మంచిగా చేసినను అతడు చెడు విశ్లేషణ చేసినట్లగును.

**(5) ఐదవ ప్రమాణము:** ఐదవ ప్రమాణము అరబ్బీ నిఘంటువు కూడ గలదు. కాని పవిత్ర ఖుర్ఆన్ స్వయంగా ఎన్నో మార్గదర్శకాలను నిర్దేశించినందున అరబి నిఘంటువుల పరిశోధన అంతగా అవసరం వుండదు. నిస్సందేహంగా జ్ఞానము పెంచుకొనుటకు అవి ఉపయోగ

పడును. నిఘంటువులను పరిశీలించినచో కొన్ని సార్లు పవిత్ర ఖుర్‌ఆన్ రహస్య జ్ఞానముల వైపు దృష్టి కలుగును. ఇలా ఒక తెలియని విషయము తెలియును.

**(6) ఆరవ ప్రమాణము:** ఆధ్యాత్మిక వ్యవస్థను అర్థము చేసుకొనుటకు భౌతిక వ్యవస్థ ఉపయోగపడును. ఎందుకనగా అల్లాహ్ తఆలా రెండు వ్యవస్థలు పరస్పరం పూర్తిగా పోలి వున్నాయి.

**(7) ఏడవ ప్రమాణము:** దైవ మిత్రుల దివ్య స్వప్నములు, సువార్తవాణీలు గలవు. ★ [(3)] ఈ ప్రమాణము ఇతర ప్రమాణములన్నిటిని మించి వున్నది.

---

★ [(3)] ఏడవ ప్రమాణ వివరణ: సయ్యద్ గారు తమ ఏ పుస్తకములోను సువార్త వాణిని సత్య ప్రమాణముగా పేర్కొనలేదు. అలా కోరడం కూడ లేదు. ఇందుకు కారణం వారు ప్రవక్తుత్వ దైవాణి లేదా దైవ మిత్రులకు అందే దైవవాణిని గౌరవంగా చూడక పోవడమే అని తెలుస్తుంది. దానిని ఒక సహజ ప్రతిభగా వారు భావిస్తున్నారు. కావున వారి ఈ భావన గురించి కూడ కొన్ని విషయములను వెల్లడించుట సమంజసమని భావిస్తున్నాను. దైవవాణిని కేవలం సహజ ప్రతిభగా భావించుట వారి ఘోర తప్పిదము, తీవ్రమైన మోసము, సత్యము నుండి దూరము చేయునట్టిదని స్పష్టముగా గుర్తుంచుకోండి. మానవునికి సహజంగానే అనేక రకాల శక్తులు గలవనే విషయము విధితమే. ఆ శక్తులన్ని ఒక క్రమ పద్ధతిలో పరస్పరం సాక్ష్యముగా వున్నవి. ఉదా॥ కొందరికి సహజంగానే గణితము, లెక్కల విద్యలో ప్రావీణ్యము కలుగుతుంది. మరికొందరికి వైద్యము అబ్బుతుంది. ఇంకొందరికి మంచి వాక్చాతుర్యము లభిస్తుంది. కాని ఈ రహస్య ప్రతిభ తనంతటతానే ఎవరిని గణితునిగా, లెక్కలలో ప్రతిభా వంతునిగా లేదా వైద్యునిగా, వాక్చాతుర్యునిగా చేయలేదు. ఇటువంటి వ్యక్తికి బోధించు ఉపాధ్యాయుడు అవసరముండును. వివేకవంతుడైన ఒక ఉపాధ్యాయుడు ఒక వ్యక్తిలో ఒక విద్య పట్ల ప్రత్యేక అనుబంధము చూసినప్పుడు దానినే సాధించాలని ప్రోత్సహిస్తాడు. ఇదే విషయమును ఈ పద్యము సూచిస్తుంది.

هر کسے را بهر کاری ساختند      میل طبعش اندران انداختند

అనగా ప్రకృతి ప్రతి ఒక్కరిని ఏదో ఒక పని కొరకు పుట్టించెను. అందుకే దాని స్వభావములో ఆ పని కొరకు ఆకర్షణ కూడ కలిగించును. →

ఎందుకనగా సువార్తవాణి పొందుతున్న దైవ మిత్రుడు తమ ఆదర్శ వంతులైన మహా ప్రవక్త సల్లంను పూర్తిగా అనుసరించును. ప్రవక్తుత్వము, క్రొత్త ఆదేశములు తప్ప ప్రవక్తకు లభించిన మిగతావన్ని అతనికి

ఈ బోధన తర్వాత బీజము వలె దాగివున్న ప్రతిభ ఉద్భవించును. ఈ విద్య గురించి వివిధ రకాల సూక్ష్మ విషయములు అతనికి తెలియును. ఆయా విద్య గురించి క్రొత్త క్రొత్త విషయములు అల్లాహ్ తఆలా ద్వారా అతని హృదయములో పుట్టించబడును. వాటిని దైవవాణి, సువార్త వాణి అని అన్నచో తప్పేమి లేదు. ఎందుకనగా మానవులకు ప్రయోజనము కలిగించే విషయములన్నియు అల్లాహ్ తఆలా ద్వారనే హృదయములో వేయబడును. ఇదే విషయమును సూచిస్తూ వైభవోపేతుడైన అల్లాహ్ తఆలా కూడ ఇట్లనెను.

فَأَلْهَمَهَا فُجُورَهَا وَتَقْوَاهَا (అష్షమ్స్:91/9)

అనగా మానవుల హృదయములలో కలిగే చెడు మాటలు మంచి మాటలు అల్లాహ్ తఆలా ద్వారనే సువార్త వాణి రూపంలో కలుగును. సత్యవంతుడు తన సత్య స్వభావము వలన అతని హృదయములో మంచి మాటలు కలిగేందుకు అర్హత పొందును. ఇలాగే దుష్టుడు తన దుష్ట స్వభావము వలన చెడు మాటలు అతని హృదయములో ఏర్పడుటకు అర్హత కలిగి వుండును. సత్యమూర్తి సహజంగానే ఇటువంటి సువార్తవాణీలు పొందుటకు ఒక సత్య శక్తి తమలో పొందును. ఇదే విధంగా దుష్టుడు సహజంగానే ఒక దుష్ట శక్తి కలిగి వుండును. కనుక ఇదే సహజ శక్తి వలన చాలా మంది మంచి మాటలు మరియు చెడు రచనలు, పవిత్ర మరియు అపవిత్ర వాక్యములను తమ స్మారకంగా వదిలిపోయారు. కాని సందేశహరుల పరిస్థితి ఇలాగే వుంటుందా! ఇప్పటి వరకు వివరించిన విధంగా అది కూడ ఒక సహజ శక్తియేనా! అది ఇటువంటి బిరుదులను పొందుతుందా! కేవలం ఇంతే విషయమైనచో వాస్తవము విధితమే. ఎందుకనగా సందేశహరుల సువార్తవాణిని సహజ శక్తి మాత్రమే అని నిర్ణయించినచో సందేశహరులు మరియు ఇలాంటి ఇతర ప్రజలలో వ్యత్యాసమును ఏర్పాటు చేయుట చాలా కష్టమైపోవును. పఠించబడుతున్న సువార్తవాణి అనగా పవిత్ర ఖుర్ఆన్ కూడ సువార్తవాణి అని మేము నమ్ముతామని సయ్యద్ గారు చెప్పవచ్చును. కాని సయ్యద్ గారి సున్నిత

నొసంగబడును. అతనికి ఖచ్చితమైన బోధన అందించబడును. అతను అనుసరిస్తున్న ప్రవక్త సల్లంకు అందిన విషయములన్నియు గౌరవ, మర్యాదగా అతనికి అందించబడును. కావున అతని విశ్లేషణ కేవలం

తెలివి నాకు బాగా తెలుసు. మేము నమ్ముతున్న పఠించబడు సువార్తవాణిని వారు నమ్మనే నమ్మరు. వాక్యములు లేనిదే ఎలాంటి దైవవాణి అందదు. అర్థము లేని పదములు ఆలోచనకు రానే రావు. అయినను పవిత్ర ఖుర్ఆన్, దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం హదీసులో కూడ ఒక తేడా వున్నది. ఇదే తేడా వలన పవిత్ర ఖుర్ఆన్ వెలువడిన చెలిమ నుండి హదీస్ వెలువడలేదని నమ్ముతాము. వాస్తవానికి దైవవాణి, సువార్తవాణి భావమును చూసినచో హదీస్ పదములు కూడ అల్లాహ్ తఆలా తరపున వచ్చినవే. ఇందుకు

وَمَا يَنْطِقُ عَنِ الْهَوٰى-اِنْ هُوَ اِلَّا وَحْيٌ يُّوْحٰى (అన్నజ్మ్:53/4,5)

సూక్తి సాక్ష్యముగా గలదు. ఎటువంటి దైవవాణి అయినను పదముల రూపంలో వెలువడునని మేము మరల గుర్తు చేయిస్తున్నాము. ఉదా॥ ఒక కవి ఒక పంక్తి వ్రాసి రెండవ పంక్తి కొరకు ఆలోచిస్తున్నప్పుడు అతనికి అల్లాహ్ తఆలా తరపున కలిగే ఆలోచన సైతం పదముల రూపంలోనే కలుగును.

వివేకవంతులు, వైద్యులు, జ్ఞానులు, కవులకు కూడ అల్లాహ్ తఆలా తరపుననే ఆలోచన కలుగుతుందని, అది కూడ దైవవాణి కోవకు చెందునని తద్వారా వారిలో సన్మార్గులకు సన్మార్గము దుష్టులకు దుష్టత్వములో ఒక శక్తి లభించునని గట్టిగా స్పష్టమైనది. వారి వారి పరిస్థితిని బట్టి అవసరమున్న కొద్ది వారికి దైవవాణి అందుతుంది. ఉదా॥ రైలు బండిని పరిశోధించిన వ్యక్తికి కూడ దేవుని తరపున ఆలోచనే కలిగెను. ఎలాక్ట్రానిక్ టెలిగ్రామ్‌ను పరిశోధించిన వ్యక్తి సైతం దైవవాణి పొందినట్లే అగును. కనుక మేము సయ్యద్ గారిని విమర్శించిన విమర్శ ఇక్కడ కూడ తలెత్తును. సయ్యద్ గారు యదార్థముగా మనసుకు కలిగే ఆలోచనలో ప్రవక్తలు, వివేకవంతులే కాక అవిశ్వాసులు, విశ్వాసులు అందరు సమానమే, ప్రవక్తల ఆలోచన సదా పవిత్రముగా వుండునని సమాధానమివ్వ వచ్చును. ఇటులైనచో అవిశ్వాసుల ఆలోచనకు భిన్నంగా ప్రవక్తుత్వ దైవవాణికి ఎలాంటి స్వీయ విశిష్టత లేదని, ప్రవక్తల దైవవాణి తప్పులకతీతంగా మాత్రమే వుండునని,

ఊహాజనితం కాక అతను చూచినది చెప్పును, వినినది వెల్లడించును. ఇటువంటి మార్గము ఈ సమాజము కొరకు ఇంకా తెరువబడి వున్నది. నిజమైన వారసుడు ఒక్కరు కూడ లేకపోవడం సాధ్యము కాదు. ప్రాపంచిక

---

అరస్తూ, అఫ్లాతూన్ మొదలగు వివేకుల దైవవాణి తప్పులకతీతంగా లేకుండెనని సయ్యద్ గారు నమ్మవలసి వుండును. కాని ఈ దావా నిరాధారమైనది, పూర్తిగా వాస్తవ విరుద్ధమైనది. ఎందుకనగా ఇటులైనచో వివేకుల తప్పులకతీతంగా వున్న ఉపదేశములు, మంచి మాటలు, ప్రవర్తనపరమైన విషయముల అధిక భాగమును పవిత్ర ఖుర్ఆన్‌కు సమానంగా మనము నమ్మవలసి వుండును. దానిని నిస్సందేహంగా దైవ శాసనముగా భావిస్తు పవిత్ర ఖుర్ఆన్‌కు సమానమని నిర్ణయించవలసి వుండును, దానిని పఠించబడు దైవవాణిగా విశ్వసించవలసి వచ్చును. తప్పులతో కూడిన భాగమును మానవ తప్పిదములుగా భావించవలసి వుండును. ప్రవక్తల ద్వారా కూడ మానవ తప్పిదములు సంభవిస్తాయి. ఈ సూత్రము ప్రకారము వివేకులు, అవిశ్వాసులను సైతం ప్రవక్తలుగా నమ్మవలసి వుండును.

ఈ ఆలోచన వలన సయ్యద్ గారి విశ్వాసము భంగమయ్యే అవకాశమున్నదని స్పష్టమైనది. ఒకప్పుడు న్యూటన్ మొదలగు వివేకుల సువార్తవాణిని ఖుర్ఆన్ సువార్తవాణి కంటే ఉత్తమముగా భావించెదరు. ఖుర్ఆన్‌ను అర్థము చేసుకొనుటకు ప్రమాణముగా ఖుర్ఆన్‌నే చేసుకున్నచో బహుశా ఈ వినాశనకర బొందలో పడకుండా మోక్షము పొందెదరు కావచ్చును. పవిత్ర ఖుర్ఆన్ ఎక్కడైనా తన సువార్తవాణిని భూమి నుండి ఉద్రేకము పొందే చెలిమతో పోల్చకుండా ఆకాశము నుండి కురిసే వర్షముతో ఎల్లప్పుడు పోల్చెను.

సయ్యద్ గారు వ్రాయక ముందే సువార్తవాణి ఏమిటి? ఎందుకు అవతరిస్తుందోనని ఎవరో ఒక అనుభవజ్ఞునిని సంప్రదించి తెలుసుకున్నచో ఈ తప్పుకు వారు పాల్పడేవారు కాదు. ఈ తట్టు ద్వారా సయ్యద్ గారు ముస్లిములలోని ఒక పెద్ద సమూహమును నాశనము చేశారు. నాస్తికము, అవిశ్వాసమునకు సమీపమునకు చేర్చారు ప్రవక్తుత్వ గౌరవమును కోల్పోయి అవిశ్వాసుడు, మోసగాడు భాగస్వాములయ్యే సహజ శక్తి వరకు దానిని పరిమితం చేసెను.

ఇప్పుడు నేను కేవలం దైవ ప్రసన్నత కొరకు నా స్వీయ సాక్ష్యమును →

కీటకము, ప్రాపంచిక ఐశ్వర్యము, తళుకు బెళుకులో నిమగ్నమైన వ్యక్తి ప్రవక్తుత్వ బోధనకు వారసుడగుట అసాధ్యము. ఎందుకనగా పవిత్రులకు తప్ప ప్రవక్తుత్వ బోధన ఎవరికి లభించదని అల్లాహ్ తఆలా వాగ్దానము

పొందుపరుస్తున్నాను. బహుశా అల్లాహ్ తఆలా వారిని కరుణించవచ్చును. కనుక ఓ చిరంజీవి సయ్యద్ ! వైభవోపేతుడైన దేవుని ప్రమాణముగా చెప్తున్నాను. సూర్య కిరణం గోడలపై పడునట్లే ఆకాశము నుండి దైవవాణి అవతరించుననే విషయము నిజమైనది. దైవ సంభాషణ సమయము సమీపించినప్పుడు మొదట అకస్మాత్తుగా ఒక రకమైన కునుకు వస్తుంది. అప్పుడు నేను మారిపోయిన వస్తువులా మారుతాను. నా ఆలోచన, నా తెలివి తేటలు, నా చెవులు అన్ని మంచిగా వుంటాయి. కాని అప్పుడు ఒక శక్తివంతమైన ఉనికి నా ఉనికిని పూర్తిగా తన పిడికిలిలో తీసుకున్నట్లు నేను భావిస్తాను. అనంతరం నా ఉనికి నరములన్ని అతని హస్తములో నేను ఊహిస్తాను. నాది ప్రతి వస్తువు అతనిదనిపిస్తుంది. ఇటువంటి పిరిస్థితి ఏర్పడిన తర్వాత అల్లాహ్ తఆలా తన వాణిలో తెలుపదలచిన విషయమును, ఆలోచనను నా మనసులో వేస్తాడు. అనంతరం ఒక విచిత్ర పద్ధతిలో ఒకటి తర్వాత మరొక ఆలోచనలు నా కండ్లకు కనిపిస్తాయి. మరికొన్ని సార్లు ఒక దాని తర్వాత మరొక ఆలోచన కలుగుతూనే వుంటుంది. ఒక ఆలోచన ఉదా॥ జైద్ ఫలానా వ్యాధి నుండి స్వస్థత పొందునా లేక పొందదా అని మనసులో ఆలోచించగానే తక్షణమే దైవవాణి వాక్యము ఒక కిరణము వలె పడుతుంది. కొన్ని సార్లు అది పడినప్పుడు శరీరం మొత్తం కంపిస్తుంది. అప్పుడు ఈ విషయము పరిష్కారమై మరొక ఆలోచన కలుగుతుంది. ఒక విల్లుకారుడు ప్రతి వేట రాగానే వేగంగా బాణము విసిరినట్లు దాని వెంటనే దైవవాణి లోని మరొక వాక్యము దాని గురించి పడుతుంది. ఈ సంభాషణల పరంపర మన సహజ ప్రతిభతో ఏర్పడినను అవతరిస్తున్న దైవవాణి మాత్రం పై నుండి పడుతున్నట్లు నేను భావిస్తాను. కవులు మొదలగు వారికి కూడ ఆలోచించిన తర్వాతనే పరిష్కారము అందించబడుతుంది. కాని దానిని ఈ దైవవాణి తో పోల్చుట ఘోర తప్పిదమగును. ఎందుకనగా ఈ ఆలోచన గమనించి, చింతించి నందున కలుగుతుంది. మంచి స్పృహలో వుండగా మానవ స్థితిలో వుండగా ఈ ఆలోచన వస్తుంది. కాని ఈ దైవవాణి మాత్రం మానవుడు తన మొత్తం ఉనికితో →

చేసి వున్నాడు. మలినముతో కూడిన ప్రతి ఒక్కరు ప్రవక్త వారసునిగా చెప్పుకొనుట జ్ఞానమును కించపరచుటయే అగును. ఆయా పవిత్ర వారసుల ఉనికిని నిరాకరించుట, ప్రవక్తుత్వ జ్ఞానములను మాజీ కథలుగా

సహా అల్లాహ్ తఆలా వశమైన తర్వాతనే అందుతుంది. అతని స్పృహ, గమనించు శక్తి ఇందులో వుండనే వుండదు. అప్పుడు నాలుక తన నాలుక కాక ఒక బయటి శక్తి దానితో పని చేయిస్తున్నట్లు అనిపిస్తుంది. నేను వివరించిన ఈ పరిస్థితిని బట్టి సహజ పరంపర ఏమిటి ? ఆకాశము నుండి ఏమి అవతరిస్తుందో తెలిసి పోతుంది. శాపముతో కూడిన ఈ నేచరియ్యత్ (ప్రకృతి)ని ముస్లిములలో నామ రూపాల్లేకుండా మటు మాయం చేయాలని నేను ముగింపులో ప్రార్థన చేస్తున్నాను. ఇస్లాం శుభము లను ఏ కంటితో చూస్తున్నారో ఆ కన్ను ముందట వున్నటువంటి పొగ తొలిగి పోనంత వరకు ఆ కన్ను తెరుచుకోలేదు.

(పారసీక పద్య అనువాదము)

(1) ఓ ప్రకృతి అభిమాని! నువ్వు ఇస్తున్న ఈ బాధ ఏమిటి? నీ చేతుల ద్వారా నలు వైపుల పీడనములు వ్యాపిస్తున్నవి.

(2) నీ దుర్మార్గమును అవలంభించిన వ్యక్తి మరల సన్మార్గమును పాటించలేదు.

(3) నేను ఎంతో లోతుగా గమనించిన తర్వాత మన ఈ ఆపద మన కర్మల ఫలితమే అని నాకు తెలిసినది.

(4) పవిత్ర ఖుర్ఆన్‌ను చదవడం, చదివించడమును ప్రజలు విడిచిపెట్టిన రోజు నుండి ఈ ఆపదల వరద వచ్చినది.

(5) వాస్తవానికి ప్రకృతి నష్టదాయకము కాదు, కాని ధర్మము అదృశ్యమైనందున తెలివి తేటల కాంతి తగ్గిపోయినది.

(6) ప్రజలు ఒక్కసారిగా బిందువు వైపు మోకరిల్లిరి, కాలువ వున్న వైపు నుండి ముఖము తప్పించుకొనిరి.

(7) స్వర్గము, ప్రళయ దినపు ప్రశ్నోత్తరాల గురించి నవ్వుతూ ఇది తెలివికందని కథ అని అంటారు.

(8) దేవదూతల ప్రస్తావన వచ్చినప్పుడు ఇది వివేకులకు అర్థము కాని విషయమని వారు అంటుంటారు.

→

అభివర్ణించుట కూడ ఒక పచ్చి మూర్ఖత్వమగును. వారి ఉనికి మన కన్నుల ముందు లేదు. వారు ప్రత్యక్షమగుట అసాధ్యమే. వారి ఆదర్శము కూడ లేదనుట సముచితము కాదు. ఇలా అయినచో ఇస్లాం సజీవమైన ధర్మముగా నిలవదు. ఇతర మతముల వలె ఇది కూడ నిర్జీవ మతమగును. గత పురాతన కాలముల నుండి కొనసాగుతున్న పవ్రక్తుత్వమును విశ్వసించు విషయము కూడ ఇలా ఒక కట్టుకథగా మారును. కాని అల్లాహ్ తఆలా దీనిని ఇష్టపడలేదు. ఎందుకనగా ఇస్లాం సజీవ నిదర్శనము, ప్రవక్తుత్వ నమ్మకము సదా సువార్తవాణి తిరస్కృతుల నోరు మూయించుటకు దైవ మిత్రులకు సువార్తవాణి రూపంలో కొనసాగుట తథ్యమని అల్లాహ్ తఆలాకు మంచిగా తెలుసు. కనుక అతడు ఇలాగే చేసెను. అల్లాహ్ తఆలా ద్వారా సువార్తవాణి పొందుతున్న వారే దైవ మిత్రులు. వారి అంతరము ప్రవక్తల అంతరమును పోలి వుండును. వారి విచిత్రమైన ప్రత్యేకతలు ప్రవక్తుత్వ సంకేతములకు కొనసాగింపుగా

(9) ఓ సయ్యద్! నువ్వు ఇటువంటి జాతికి నాయకుడిగా వున్నావు. నీ పాదము సన్మార్గమున లేదని తెలుసుకొనుము సుమా!

(10) వృద్ధాప్యములో నీకు ఇటువంటి ఆలోచన ఎందుకు కలిగినది. పశ్చాత్తాపము వ్యక్తపరచుము! ఇది ధర్మబద్ధ పద్ధతి కాదు.

(11) ఇటువంటి ఊహల వలన దేవుని భావము కూడ పొరపాటని చెప్తావేమో అని నేను భయాందోళనకు గురవుతున్నాను.

(12) ఓ వ్యక్తి! ఇటువంటి విషయములను విడిచి పెట్టుము. ఎందుకనగా దైవత్వములో జోక్యము చేసుకొనుట ఒక రకమైన పిచ్చితనము.

(13) ఊహలతో ఏమి లభిస్తుంది. సహనముతో కూర్చొనుము. వృధా మాటలకు ఇది తగిన సమయము కాదు.

(14) ఓ దాసుడా! దేవునితో జ్ఞానమును యాచించుము, ఎందుకనగా (ఉచిత ముగానే అర్థమగటకు) దైవ రహస్యములు దొంగలించిన సామాగ్రి కాదు.

(సమాప్తం)

వుండును. దైవవాణి అవతరణ రహస్యము ఏదో ఒక కాలములో నిరాధారమై ఒక కట్టుకథగా మిగిలిపోకూడదని ఇలా జరుగును. దైవ సందేశహరులు తమ వారసులు లేకుండానే ఈ ప్రపంచము వీడి పోతారు, ఇప్పుడు వారి గురించి ఏదేని అభిప్రాయము వెల్లడించుట ఒక కట్టుకథ తప్ప మరేమి లాభము లేదనే ఆలోచన పొరపాటు. ప్రతి కాలములో అవసరం మేరకు వారి వారసులు జన్మిస్తూనే వుంటారు. అలాగే ఈ శతాబ్దములో నేనున్నాను. అల్లాహ్ తఆలా ప్రత్యేక సహాయము లేనిదే ముస్లిముల ఆలోచనల నుండి తొలగని తప్పిదములను తొలగించుటకు, తిరస్కృతులకు సత్యమైన సజీవ దేవుని నిదర్శనము ఇచ్చుటకు, ఇస్లాం వైభవము, యదార్థమును తాజా సంకేతములతో నిరూపించుటకు అల్లాహ్ తఆలా ఈ కాలములో నన్ను పంపెను. ఇదే జరుగుతుంది. పవిత్ర ఖుర్ఆన్ జ్ఞానములు తెలుపబడుతున్నవి. దైవ శాసనపు రహస్యములు, విద్యలు బహిర్గతమగుతున్నవి. ఆకాశ మహిమలు, చమత్కారములు ప్రత్యక్షమగు తున్నవి. ఇస్లాం అందములు, కాంతులు, శుభములను అల్లాహ్ తఆలా క్రొత్తగా ఆవిష్కరిస్తున్నాడు. కనులు కలిగినవారు చూడగలరు, సత్యమైన ఉద్రేకము గల వారు పొందవచ్చును. ఏమాత్రం అల్లాహ్, పవిత్ర ప్రవక్త ప్రేమ కలిగినవారు లేచి పరీక్షించవచ్చును. దేవుని ఇష్టమైన ఈ సంఘము (జమాఅత్)లో ప్రవేశించవలెను. దీని పునాది ఇటుకను అల్లాహ్ తఆలా తన స్వహస్తముతో పెట్టెను. ఇప్పుడు సువార్తవాణి ద్వారము మూసుకు పోయినది, సంకేతములు వెలువడలేవు, దుఆలు ఆమోదించబడవు అని అనుట భద్రతతో కూడినది కాక వినాశనకర మార్గము. దేవుని శుభమును రద్దు చేయకండి, లేచి పరీక్షించండి, పరిశీలించండి. అనంతరం సాధారణ ఆలోచన, సాధారణ తెలివి తేటలు, సాధారణ విషయముల వ్యక్తి అని తేలినచో ఆమోదించ కండి. కాని సత్యమును బలపరచు, దైవవాణి పొందు వారిలో బహిర్గతమయ్యే మహిమాన్విత చమత్కారము, అతని హస్త జ్యోతిని

పొందినచో ఆమోదించండి. ఇస్లాంను నిర్జీవ మతముగా వుంచ దలచు కోలేదని అల్లాహ్ తఆలా భావించుట అతడు తన దాసులపై చేసిన గొప్ప ఉపకారమని నిశ్చయముగా భావించండి. అంతేగాక ఎల్లప్పుడు నమ్మకము, విజ్ఞానము, వివాదములకు సమాధాన పద్ధతులను తెరిచే వుండదలచెను. ఎవరైనా ప్రవక్తుత్వ సువార్త వాణిని నిరాకరిస్తు ఇటువంటి భావన పూర్తిగా మీ అపోహ అని అన్నచో అతని నోరు మూయించుటకు ఉదాహరణ చూపడం తప్ప మరెటువంటి నిదర్శనము వున్నదో మీరే ఆలోచించండి. ఆకాశ శుభములు ఇస్లాంలో కొన్ని సంవత్సరములు మాత్రమే వున్న తర్వాత అది ఎండిపోయిన, మృత మతముగా మారెననే విషయము ఒక శుభవార్తా లేక దుర్వార్తా! ఒక నిజమైన మతము కొరకు ఇటువంటి లక్షణములు సబబేనా!!!

సారాంశమేమనగా నిజమైన విశ్లేషణ కొరకు ప్రమాణములు ఇవి. సయ్యద్ గారి విశ్లేషణ అధిక చోట్ల ఈ ఏడు ప్రమాణములను కలిగి లేదనుటలో ఎలాంటి సందేహము లేదు. ప్రస్తుతం దానిని ఖండించుట మా ఉద్ధేశము కానే కాదు. సయ్యద్ గారికి ప్రకృతి పట్ల చాలా గర్వముండెను. కాని తమ విశ్లేషణలో వారు ప్రకృతి చట్టమును కూడ విస్మరించిరి. ఉదా॥ ప్రవక్తుత్వ దైవవాణి తమ స్వభావ సామర్థ్యము తప్ప మరేమి కాదని, ఇందులో దైవము లేదా దేవదూతల జోక్యము వుండదని వారు తమ విశ్వాసమును వెల్లడించిరి. ఇది దైవ ప్రకృతి చట్టమునకు పూర్తిగా విరుద్ధమైనది. మనము మన శారీరక శక్తుల పరిపూర్ణతకు ఆకాశ మాధ్యమము అవసరమైనట్లు మనము చూస్తున్నాము. మన ఈ శారీరక వ్యవస్థ స్థాపన, నిర్దేశిత లక్ష్యముల వరకు చేరుకొనుటకు అల్లాహ్ తఆలా సూర్యుణ్ణి, చంద్రుణ్ణి, నక్షత్రములను, ఇతర గ్రహాలను మన సేవకు నియమించెను. అనేక మార్గముల గుండా ప్రయాణించి ఈ దేవుని శుభము మన వరకు చేరుతుంది. మాధ్యమము లేనిదే ఎన్నటికి అందదు.

ఉదా॥ మన కండ్లకు వెలుతురు అల్లాహ్ తఆలా ద్వారనే చేరుతుంది. ఎందుకనగా అతడే అన్నిటికి కారకుడు. కాని అది సూర్యుని ద్వారా మన కండ్ల వరకు చేరుతుంది. అల్లాహ్ తఆలా స్వయంగా తన పవిత్ర చేతులను పొడుగ్గా చాపి ఏదేని వస్తువు మనకు అందిస్తున్నట్లు మనము బాహ్య వ్యవస్థలో చూడలేము. వాస్తవానికి ప్రతి వస్తువు మనకు మాధ్యమముతో లభిస్తుంది. మన బాహ్య శక్తి సంపూర్ణ స్థాయి కలిగిలేనట్లు కూడ మనము చూచెదము. అనగా ఏదేని శాశ్వతంగా కాంతిని కలిగి లేదు. మీరు నిర్ణయించిన దైవవాణి శక్తి వలె వారిలో వున్న శక్తి సూర్యుని అవసరము లేకుండా చేయలేదు. కావున ఈ వ్యవస్థకు వ్యతిరేకంగా మీరు సూచించిన నిరాధార విషయములు ఎలా సబబుగా వుండగలవు. ఇంతే కాక స్వీయ అనుభవము అన్ని అనుభవాల కంటే మిన్న. అది కూడ మీ అభిప్రాయము ను తిరస్కరిస్తుంది. ఎందుకనగా ఈ భవదీయుడు సుమారు 11 సంవత్సరముల నుండి దైవవాణి, సంభాషణతో సత్కరించబడి వున్నాడు. ఈ విషయము అనగా దైవవాణి ఆకాశము నుండే అవతరిస్తుందని నాకు మంచిగా తెలుసు. దైవవాణిని ప్రపంచములోని ఏదేని వస్తువుతో పోల్చ వచ్చినచో అది విద్యుత్తు తీగతో పోల్చబడును. అది తన ప్రతి మార్పును తానే సూచిస్తుంది. దైవవాణి బయటి నుండి నాపై అవతరించినప్పుడు బయటి నుండి ఏదో ఒక శక్తి ఆవహించుకున్నట్లు నేను గమనిస్తాను. నేను తెలుసుకున్నదేమనగా కొన్ని ఈ ఆవహించుకొను శక్తి ఎంతగా నన్ను తన కాంతులతో బిగించుకుంటున్నదనగా నేను దాని వైపు లాక్కొన బడతాను, నాలో వున్న శక్తి దానిని ఎదురించలేదు. ఈ ఆవహింతలో నేను స్పష్టమైన వాక్కును వింటాను. కొన్ని సార్లు దేవదూతలను చూస్తాను. ★ [4] సత్యములో ఎంతటి ప్రభావము, వైభవము వుంటుందనగా ఆ

★ [4] ఇంతేకాక కొన్ని సార్లు దేవదూతలు కనిపించడమే కాకుండా దైవవాణిలో తమ మాధ్యమమును బహిర్గతం చేస్తారు. **(సమాప్తం)**

వాక్కు కొన్ని సార్లు పరోక్ష విషయములు కలిగి వుండును. ఇటువంటి ఆవహింత, బిగింపు బయటి నుండి వస్తుంది. తద్వారా అల్లాహ్ తఆలా ఉనికి సాక్ష్యము లభిస్తుంది, కనుక దానిని నిరాకరించుట స్పష్టంగా సత్యమును హత్య చేయుటగును.

మరణించక ముందే నేడు సయ్యద్ గారు ఈ సత్యమును అంగీకరించుటయే ఉత్తమము. వారు బాహ్య వ్యవస్థను మాత్రము చూస్తున్నారు కాని అంతర వ్యవస్థను దానికి జోడంచనందుకు ఆశ్చర్యము కలుగుతుంది. అల్లాహ్ తఆలా మన శారీరక వ్యవస్థను ఎలా పుట్టించాడనగా ఆకాశము నుండి బాహ్య వెలుతురును మన కొరకు దింపుతాడు. నిజమైన ప్రభావశీలి మాధ్యమముల ద్వారా మన శారీరక శక్తులపై తన శుభమును కలిగిస్తాడు. బాహ్య మార్గములు లేనిదే ఎటువంటి శుభమును అవతరించక పోవడం అతని అలవాటు. అలాంటప్పుడు ఆ అల్లాహ్ మన ఆధ్యాత్మిక వ్యవస్థలో ఈ మాధ్యమముల పరంపరను పూర్తిగా మన నుండి ఎలా దూరము చేయగలడు. మనము శారీరకంగా ఈ పరంపర నుండి దూరముండగలమా! లేదా అల్లాహ్ తఆలాతో ప్రారంభమై మన వరకు చేరే మాధ్యమముల పరంపరతో మనము జోడించ బడ్డామా. ఈ అంశము గురించి గమనించుటకు మా పుస్తకము తౌజీహ్ మరామ్, ఆయీనా కమాలాతె ఇస్లాంను పఠించ వలెను. ప్రత్యేకంగా దేవదూతల అవసరము గురించి ఆయీనా కమాలాతె ఇస్లాంలో విస్తృతంగా చర్చించి నట్లు మరో పుస్తకములో మీరు చూడలేరు. సయ్యద్ గారికి అల్లాహ్ పట్ల ఎంత అవగాహన వున్నదో తెలుసుకొనుటకు వారి ఈ మాటలు సరిపోవును. పుట్టించబడిన వస్తువులు లేదా ప్రాణులు నిజమైన సృష్టికర్త అధీనము, అధికారములకు కట్టుబడి లేవు. దేవుని దైవత్వము అతని సంపూర్ణ ప్రకృతి శక్తితో ముడి పడివున్నదని వారికి తెలియదు. అతని సృష్టి అయిన ప్రాణులు ప్రతి క్షణం అతని అనంత అధీనములో వుండుటనే

ప్రకృతి శక్తి అంటారు. నిశ్చయముగా అతను ఈ ప్రాణులను పుట్టించిన చో అంతులేని తన ఉనికి వలె అంతులేని శక్తులకు అవకాశము వుంచుకొనుట సత్యమే. తద్వారా ఏ విధంగాను అతని దైవత్వములో ఆటంకము ఏర్పడదు.★[5] **నవూజు బిల్లాహ్** పరమేశ్వరుడు ఆత్మలను, అణువులను పుట్టించలేదనే ఆర్యా హిందువుల మాట ఒక వేల నిజమైనచో

★[5] అల్లాహ్ తఆలా అంతులేని వివేకము నిరంతర పరిస్థితులపై అధికారము గలవాడనే విషయమును విమర్శించినచో వస్తువుల స్వంత గుణముల పట్ల నమ్మకము సడలిపోవును. ఉదా॥ అల్లాహ్ తఆలా నీటి ఆకారమును మార్చి దానికి గాలి ఆకారమిచ్చినచో లేదా గాలి ఆకారమును మార్చి దానికి అగ్ని ఆకారము ఇచ్చినచో అగ్ని ఆకారమును మార్చి అతనికి తెలిసి రహస్య కారణములను నీటి రూపములోకి మార్చినచో లేదా మట్టిని భూమిలో తన సూక్ష్మ శక్తులనుపయోగించి బంగారము మార్చినచో లేదా బంగారమునే మట్టిగా మార్చినచో నమ్మకము లేకుండా పోవును, సర్వ విద్యలు, విజ్ఞానములు వృధా అయిపోవును. ఈ ప్రశ్నకు సమాధానమేమనగా ఈ ఆలోచన నిరర్థకం. ఎందుకనగా మనము చూస్తున్నట్లు అల్లాహ్ తఆలా తన రహస్య జ్ఞానముల శక్తినుపయోగించి గ్రహాలను వందలాది రూపములలో మార్చుతుంటాడు. ఒక్క పృథ్వినే గమనించినచో విభిన్న రకాల మార్పులతో అది ఏదేదో సిద్ధము చేస్తుంటుంది. దీని నుండే సిమ్మల్ ఫార్ వెలువడుతుంటుంది, దీని నుండే ఫాజ్ విషము వెలువడుతుంది, దీని నుండే బంగారము, దీని నుండే వెండి, దీని నుండే వివిధ రకాల వజ్రములు వెలువడుతాయి, ఇలాగే పొగల రూపములో తిరిగిపోయి ఆకాశములో అనేక రకాల వస్తువులు సిద్ధమైతాయి, ఆయా పొగల నుండే మంచు కురుస్తుంది, వాటి నుండే వడగళ్లు పడతాయి, వాటి నుండే విద్యుత్తు వెలువడుతుంది, వాటి నుండే పిడుగులు పడుతాయి. ఇంకా నిరూపితమైన విషయమేమనగా ఆకాశము నుండే ఒక్కోసారి బూడిద పడుతుంది. ఈ పరిస్థితుల వలన విద్య నిరర్థకమవుతుందా! లేదా నమ్మకము లేకుండా పోతుందా! ఈ వస్తువులలో, వాటి స్వభావములో ఆది నుండే అల్లాహ్ తఆలా ఈ గుణములను పెట్టినాడని అన్నచో, ఇందుకు మా సమాధానమేమనగా ఇటువంటి విభిన్న స్థితులు గల వస్తువులలో పోలిన గుణములు పెట్టలేదని మేమెప్పుడు, ఎన్నడు చెప్పాము. →

నిస్సందేహంగా ఇటువంటి బలహీన పరమేశ్వరుడు కొంత మేరకు బలహీన ప్రభుత్వముతో సరి పెట్టుకొనును. ఒక అవమానముతో అతని మర్యాద భంగమగును. కాని సర్వశక్తి మంతుడైన మా దేవుడు అలా

---

వాస్తవానికి నిజమైన అభిప్రాయమేమనగా అల్లాహ్ తఆలా తన ఏకైక ఉనికిలో వస్తువులన్నిటిని ఒకే వస్తువు రూపంలో పుట్టించినాడు, తద్వారా అవన్ని ఏకైక సృష్టికర్తను సూచించును. కావున అల్లాహ్ తఆలా ఇదే ఏకత్వమును బట్టి, ఇంకా తన అనంత ప్రకృతి శక్తి అనుసారము విభిన్న వస్తువుల గుణము వాటిలో పెట్టెను. తమ అదృష్టము, దురదృష్టము కొద్ది

خٰلِدِيْنَ فِيْهَآ اَبَدًا (అల్ జిన్న్-72:24)

అనగా 'వారు అందులో దీర్ఘ కాలము వరకు వుందురు.' ప్రకారము నిర్ణయించబడినవి, అల్లాహ్ తఆలా వాగ్దానము మేరకు శాశ్వతంగా మార్పుకు గురికాని విధంగా పుట్టించినవి తప్ప సృష్టిలోని ఏదియును పరిస్థితులకనుగుణంగా మారనిది లేదు. యదార్థమేమనగా ప్రతి క్షణం ప్రతి శరీరములో ఏదో ఒక మార్పు ఏర్పడుతూనే వుంది. సహజ విద్య పరిశోధనల ద్వారా రుజువైనదేమనగా తుదకు మూడు సంవత్సరముల వరకు మానవుని శరీరము మారిపోతుంది. గత శరీరము అణువుల రూపంలో ఎగిరిపోతుంది. ఉదా॥ నీరు అయినను లేదా అగ్ని కావచ్చును అది మార్పునకు అతీతం కాదు. రెండు రకాల మార్పులు వాటిపై అధికారము చెలాయిస్తున్నాయి. ఒకటి ఏమనగా కొన్ని భాగములు లేచి పోతుంటాయి మరికొన్ని వచ్చి చేరుతుంటాయి. రెండవదేమనగా వెళ్ళిపోయిన భాగములు తమ తమ సామర్థ్యము మేరకు రెండవ జన్మనెత్తుతాయి. సారాంశమేమనగా అంతమైపోవు ఈ ప్రపంచము ను మార్పు చేర్పులకు గురి చేయుట అల్లాహ్ తఆలా ఒక పద్ధతి. మరొక సూక్ష్మ దృష్టితో చూసినచో ఈ వస్తువులన్నియు ఏకైక చెలిమ నుండి లబ్ది పొందుతున్నందున తమ ప్రాథమిక స్థాయిలో ఒక్కటే అనిపించుకొనును. ఈ వస్తువులన్నిటి సంపూర్ణ సృష్టికర్త మానవుడు కాలేదు. ఎందుకనగా సంపూర్ణ వివేకవంతుడైన అల్లాహ్ తన అనంత వివేక రహస్యములను ఆవహించుకొను శక్తి మరెవరికి ఇవ్వలేదు. మనకు తెలిసినను తెలియక పోయినను ఆకాశ గ్రహాలలో మార్పు చేర్పులు ఎక్కడ సంభవిస్తున్నాయని అడిగినచో నిస్సందేహంగా వాటిలో కూడ మార్పులు చేర్పులు →

కాదు. అతడు ప్రపంచములోని మొత్తం అణువులను, ఆత్మలను, సర్వ ప్రాణులను, వస్తువులను పుట్టించు వాడు. అతని ప్రకృతి శక్తి గురించి ఏదేని ప్రశ్న ఉత్పన్నమైనచో అతని సంపూర్ణ గుణములు, సత్యమైన

---

సంభవిస్తున్నాయని నేను చెప్పగలను. అందుకే ఒక రోజు అవి క్షీణించి పోవును. ఇదే విధంగా వేలాది వస్తువుల మార్పు చేర్పులను చూసినచో ఏ వస్తువు కూడ మార్పులకు అతీతం కాదని రుజువగును. మొదట మీరు పృథ్వీలోని మార్పులను నిరాకరించండి, తర్వాత ఆకాశము గురించి చర్చించండి.

تو کار زمیں را نکو ساختی　　　که با آسمان نیز پرداختی

అనగా నువ్వు పృథ్వీ పనులన్నిటిని చక్కబెట్టినావా! లేనిచో మరి ఆకాశము వైపు ఎందుకు పరుగిడుతున్నావు?

సారాంశమేమనగా వివిధ రకాల మార్పులు చేర్పులు ప్రతి రోజు అనుభవములోకి వస్తున్నప్పుడు, దైవ ఏకత్వ ఉనికి సైతం ఈ వస్తువులన్నిటి చెలిమ, ఆరంభము ఒక్కటే వుండవలెనని ఆశించెను. ప్రతి అణువణువుపై అల్లాహ్ తఆలా అధికారము కలిగి వున్నప్పుడే అతని పరిపూర్ణ దైవత్వము కొనసాగవచ్చును. కావున ఈ మార్పులు చేర్పుల ఫలితంగా నమ్మకము లేకుండా పోవును, విద్యలన్ని వృథా అగునను విమర్శ, ఆలోచన తప్పిదము కాక మరేమగును. నీటితో అగ్ని పని తీసుకొనుట లేదా అగ్నితో నీటి ఫలితము వెల్లడించుటకు సర్వశక్తిమంతుడైన అల్లాహ్‌కు అధికారము గలదని మనమంటాము. దీనికర్థము తన అంతులేని వివేకమును ఇచట ఉపయోగించక కేవలం ఆదేశించవలెనని కానే కాదు. ఎందుకనగా దేవుని ఏ పని కూడ వివేకరహితం అస్సలు కాదు, కాకూడదు. మా ఉద్దేశమేమనగా అతడు నీటితో అగ్ని పని లేదా అగ్నితో నీటి పని తీసుకోదలచి నప్పుడు ఈ ప్రపంచములోని ప్రతి అణువణువుపై తనకు గల అధికారాన్ని ఉపయోగించి ఒక పద్ధతితో ఆ పనిని చేయును. అవి మనకు తెలియవచ్చును లేదా తెలియక పోవచ్చును. వివేకముతో చేయబడిన పనుల వలన విద్యలు పనికి రాకుండా పోక విద్యలు ప్రగతి చెందును. చూడండి! నీటితోనే ఒక పద్ధతినుపయోగించి మంచు తయారు చేయబడును లేదా విద్యుత్తు సృష్టించబడును. దీని ద్వారా నమ్మకము సడలిపోతుందా లేక విద్య వృథా అవుతుందా.

→

వాగ్దానములకు విరుద్ధము కాని ఇతర విషయములన్నిటిపై సర్వాధికారి. అతనికి అధికారమున్నను చేయుటకు ఇష్టపడదని అనుట విచిత్రమైన, తెలివి తక్కువ ఆరోపణ. అతని గుణములకు

ఇచట మరొక రహస్యము గుర్తుంచుకోదగ్గది. అదేమనగా దైవ మిత్రుల ద్వారా కొన్ని సార్లు ఇటువంటి మహిమలు వెలువడుతాయి. అనగా నీరు వారిని ముంచలేదు, అగ్ని వారికి నష్టము కలిగించలేదు. అందులో కూడ గల భేదమేమనగా వివేకవంతుడైన అల్లాహ్ అనంత రహస్యములను మానవుడు అవహించలేడు, తన మిత్రులు, తన సమీపులకు అవసరమొచ్చినప్పుడు ఒక మహిమ చూపుతాడు. తద్వారా ఆ అవసరము కొరకు ప్రపంచములో మార్పులు చెందుతాయి. అనంతరం ఇటు వంటి రహస్య కారణములు ఏకమైతాయి. ఉదా॥ అగ్ని తన దహించు శక్తిని కోల్పోవును. ఆకాశ గ్రహాల ప్రభావములు కావచ్చును లేదా స్వయంగా ఈ అగ్నిలోని ఏదో రహస్య గుణము వలన లేదా శరీరములోని ఏదో గుప్త విశిష్టత లేదా ఆయా సకల విశిష్టతల సమ్మేళనము, ఆయా కారణములు ఆయా శ్రద్ధ, ఆ దుఆ ఫలితము వలన కదులును. అప్పుడు ఒక మహిమ వెలువడును. కాని దీని వలన వస్తువుల గుణముల పట్ల నమ్మకము సన్నగిల్లదు లేదా విద్యలు వృధా కావు. వాస్తవానికి దైవ జ్ఞానములలోని ఒక జ్ఞానమిది. ఇది తన స్థాయికి తగ్గది. ఉదా॥ అగ్ని దహించుట దాని సహజ గుణము. కాని ఒక్కోసారి ఆధ్యాత్మిక శక్తి అగ్నిని జయించి తన ప్రత్యేక సమయము, సందర్భమున తన ప్రభావము చూపుతుందని భావించండి. ఈ సూక్ష్మ విషయమును ప్రపంచము అర్థము చేసుకోలేదు. ఎందుకనగా మానవుడు సంపూర్ణ అల్లాహ్ తఆలా ఆత్మకు దర్పణంగా వుంటాడు. ఒకప్పుడు ఆ మానవుడు సంపూర్ణ స్థితికి చేరుకున్నప్పుడు ఒక్కోసారి అతనిపై ఎలాంటి సమయము వస్తుందనగా అతడు ఆ అద్భుత స్థాయికి చేరుకున్నందున ప్రతి వస్తువు అతనితో అల్లాహ్ తఆలాతో భయపడినట్లే భయపడును. అప్పుడు అతనిని క్రూర మృగం ముందు వేసినను, అగ్నిలో పడవేసినను అతనికి ఎలాంటి నష్టము కలుగదు. ఎందుకనగా అప్పుడు అతనిలో అల్లాహ్ తఆలా ఆత్మ వుంటుంది. ప్రతి వస్తువుతో భయపడే ఒక కాలము వుంటుంది. ఇది విజ్ఞానపు చివరి రహస్యము. సంపూర్ణుల సత్సంగములో వుండనిదే ఇది అర్థము కాదు. ఇదెంతో సూక్ష్మాతి సూక్ష్మమైన జ్ఞానము అయినందున అరుదుగా

كُلَّ يَوْمٍ هُوَ فِيْ شَاْنٍ (అర్రహ్మాన్:30) అనగా 'అతడు ప్రతి దినము ఒక క్రొత్త స్థితిలో వుండున'ను విషయము తగినది. ఇలాగే నీటి నుండి చల్లదనమును దూరము చేయుట లేదా అగ్ని గుణమైన దహనము ను లేకుండా చేయుట అతని సంపూర్ణ గుణములు, సత్యమైన వాగ్దానములకు విరుద్ధము కానిచో ఈ వస్తువుల గుణములను ఎన్నడు మార్చకూడదని అతను సదా కొరకు నిర్ణయించుకున్నాడని ఎలా నమ్మకము తో చెప్పగలరు!!! దీని ఖచ్చితత్వానికి నిదర్శనమేమిటి. దీనికి కారణమేమిటి, దైవత్వమును అవమానపరిచే ఈ ఏర్పాటు అవసరము దేవునికి ఎందుకొచ్చినది. సయ్యద్ గారు తన రచనలో ఈ బలహీన ఆలోచన బుద్ధిహీనతను అర్థము చేసుకున్నారని

---

సంభవిస్తున్నందున ఈ తత్వమును మించిన మరొక విషయము లేదు. కాని గుర్తుంచుకోండి! ప్రతి వస్తువు అల్లాహ్ తఆలా పిలుపును వింటుంది. ప్రతి వస్తువుపై అల్లాహ్ తఆలా అధికారము కలిగి వున్నాడు. ప్రతి వస్తువు ముకుతాడు అల్లాహ్ తఆలా చేతిలోనే వున్నది. అతని వివేకము అనంతము. ప్రతి వస్తువు పునాది వరకు చేరి వుంటుంది. దేవుని శక్తులను బట్టి ప్రతి వస్తువులో విశిష్టతలు గలవు. ఈ విషయమును విశ్వసించని వ్యక్తి مَا قَدَرُوا اللهَ حَقَّ قَدْرِهٖ (అల్ అన్ఆమ్-6:92) అనగా 'వారు అల్లాహ్ (గుణముల)ను అంచన చేయవలసిన రీతిలో చేయలేక వుండిరి.' కి సమానమైన వర్గములో పరిగణించబడును. మానవుడు మొత్తం ప్రపంచానికి సంపూర్ణ దర్పణముగా వుంటాడు. అందుకే ప్రపంచం మొత్తం అతని వైపు సమయాను సారము ఆకర్షించబడుతుంది. అతడు ఆధ్యాత్మిక లోకములో సాలె పురుగు వలె వుండును. మొత్తం ప్రపంచము అతని తీగలగును. మహిమలు, అద్భుతమునకు ఇదే రహస్యము.

بر کاروبار ہستی اثری ست عارفاں را    زجہاں چہ دید آنکس کہ ندید ایں جہاں را

అనగా అల్లాహ్ తఆలా ప్రియులకు ప్రపంచములోని ప్రతి వస్తువుపై ప్రత్యేక ప్రభావము ఇవ్వబడును. ఈ ప్రభావమును చూడలేని వారు నిశ్చయముగా ప్రపంచము లోని ఏ వస్తువును చూడనట్లే. **(సమాప్తం)**

తెలుస్తుంది. అందుకే తమ బలహీన మాటను నిరూపించుకొనుటకు మరో బలహీన సాకును వారు ప్రవేశ పెట్టారు. అదేమనగా అల్లాహ్ తఆలా పవిత్ర ఖుర్ఆన్‌లో ఒక చోట అగ్ని వేడిగా వుండునని సూచించగా మరొక చోట నీరు చల్లగా వుండునని సంజ్ఞ చేశాడు. సూర్యుడు తూర్పు నుండి ఉదయించి పడమర వైపునకు వెళ్లునని ఒకసారి తెలిపెను. ప్రస్తుతం కొనసాగుతున్న ఈ స్థితులను తెలుపుట సయ్యద్ గారి దృష్టిలో వాగ్దానము లనబడును. వీటిలో మార్పులు చేర్పులు సాధ్యము కాదు. నిదర్శనములను తెలుపు పద్ధతి ఇదే అయినచో సయ్యద్ గారికి చాలా కష్టము ఎదురగును. ఎందుకనగా మొత్తం ప్రస్తావనలు పవిత్ర ఖుర్ఆన్ వాగ్దానములో గలవని వారు నమ్మవలసి వచ్చును. ఉదా॥ అల్లాహ్ తఆలా హ్రజత్ జకరియ్యాకు శుభవార్తనిచ్చి

إِنَّا نُبَشِّرُكَ بِغُلَٰمٍ (మర్యమ్-19:8)

అనగా మేము నీకొక బాలుని శుభవార్త నిస్తున్నాము. సయ్యద్ గారి సూత్రము ప్రకారము హ్రజత్ యహ్యా ఎల్లప్పుడు **గులాం** అనగా బాలునిగా వుండవలెను. ఎందుకనగా అల్లాహ్ తఆలా హ్రజత్ యహ్యాను బాలుడని పిలిచెను. ఇదొక వాగ్దానమైనది. ఇటువంటి అనేక ఉదాహరణలు గలవు. వాటన్నిటిని ప్రస్తావించుట సమయమును వృధా చేయుట మాత్రమే అగును. సయ్యద్ గారి దృష్టిలో సంభవిస్తున్న సంఘటనలను ప్రస్తావించడమే భవిష్యత్తు కొరకు, ఎల్లప్పటి కొరకు తప్పక వాగ్దానమైనచో వారితో భయడపడ వలెను. ఎందుకనగా ఇలా మాటి మాటికి మానవులకు తప్పనిసరి అయిపోవును. ప్రస్తుత సంఘటనను తెలుపడాన్ని వారు శాశ్వత వాగ్దానముగా భావింతురు. సయ్యద్ గారు తన చివరి రోజును గుర్తు చేసుకొని కొన్ని రోజులు ఈ భవదీయుని సత్సంగములో వుండుట మేలని నేను భావిస్తున్నాను. నేను అవతారుణ్ణి, శుభవార్త నిచ్చువాడనైనందున వారి సంతృప్తి కొరకు శ్రద్ధ చూపుతానని

వాగ్దానము చేస్తున్నాను. సయ్యద్ గారు నిర్ణయించుకున్న ప్రకృతి చట్టమును ఒక్కసారిగా నిర్వీర్యం చేసే విధంగా అల్లాహ్ తఆలా ఏదో ఒక సంకేతము చూపుతాడని నేను ఆశిస్తున్నాను. సయ్యద్ గారి దృష్టిలో ప్రకృతి చట్టమునకు విరుద్ధమైన అనేక సంఘటనలు ఇప్పటి వరకు చాలా సంభవించినవి. వాటిని ప్రస్తావించుట లాభదాయకము కాదు. ఎందుకనగా సయ్యద్ గారు వాటిని కథలుగా భావింతురు. దైవవాణి ద్వారా దైవ మిత్రులకు అందే బయటి సువార్తవాణీలను సైతం సయ్యద్ గారు నిరాకరిస్తున్నారు. వారి దృష్టిలో అగ్ని తన వేడి గుణమును వీడునట్లే సువార్తవాణీలు కూడ ప్రకృతి చట్టమునకు విరుద్ధమైనవి. ఇలాగే దుఆల ఫలితంగా పరిష్కారమగు దుఆల స్వంత ప్రభావములను కూడ సయ్యద్ గారు ప్రకృతి చట్టమునకు విరుద్ధమని భావిస్తున్నారు. సయ్యద్ గారు నా వద్దకు రాలేక పోయినచో ఈ రెండు విషయములలో అనగా సత్యమును స్వీకరిస్తానని వాగ్దానము చేసి నేను అల్లాహ్ తఆలా ఆస్థానములో చేసిన దుఆ ఫలితముగా వెలువడే విషయమును ప్రచురించుటకు అనుమతివ్వ గలరు. తద్వారా ప్రజలందరికి ప్రయోజనము కలుగును. సయ్యద్ గారి అభిప్రాయము వాస్తవరూపంలో సరియైనచో నేను నా లక్ష్యములో సఫలము పొందను. లేనిచో వివేకవంతులు సయ్యద్ గారి చెడు విశ్వాసముల నుండి విముక్తి పొంది, మరల తమ వైభవోపేతుడైన అల్లాహ్ తఆలాను గుర్తింతురు, ప్రేమతో అతని వైపు తిరిగి వత్తురు. దుఆ చేస్తున్నప్పుడు అతని కరుణతో నిరాశులు కారు, చేతులు లేపుతున్నప్పుడు ఆనంద పడుదురు. అల్లాహ్ తఆలా ఉనికితో కలిగే ప్రయోజనమిదే. అనగా అతడు మన దుఆలను ఆమోదించును, తన ఉనికి గురించి మనకు సమాచార మందించును. వేలాది కష్టములను మనము భరిస్తు ఒక విగ్రహము వలన ఒక ఊహాజనిత దేవుని ఆలోచన మనసు కలిగించుకొని, అతని పిలుపును మనము విననిచో, అతని ప్రత్యేక శక్తి మహిమను దర్శించు కొననిచో లాభమేమిటి?

ఆ సర్వశక్తి మంతుడైన అల్లాహ్ వున్నాడని, ప్రతి వస్తువుపై అతనికి అధికారము గలదని నిశ్చయముగా భావించండి. అతని చేతులు కట్టి వేయబడక అతని చేతులు చాలా పొడువైనవి. అతను కోరినట్లు ఖర్చు చేస్తాడు, అతను ఆశించినట్లు పనులు చేస్తాడు. అతనికి ప్రతి వస్తువుపై సంపూర్ణ అధికారము గలదు. సకల లోకాల సంరక్షకునికే సకల సంకీర్తనములని మేము ముగింపులో ప్రకటిస్తున్నాము.

**(పారసీక పద్య అనువాదము)**

(1) అల్లాహ్ తఆలా ముఖము అన్వేషితులకు కనిపించకుండా వుండదు. అతడు సూర్యునిలో కూడ ప్రకాశిస్తాడు, చంద్రునిలో కూడ ప్రకాశిస్తాడు.

(2) కాని అతని అందమైన ముఖము నిర్లక్ష్య ప్రజలకు కనిపించదు, తెర తొలగించబడుటకు నిజమైన ప్రేమికుడు కావలెను.

(3) అతని పవిత్ర ముఖము గర్వము దరి చేరదు, అందుకు చింతన తప్ప మరో దారి లేనే లేదు.

(4) ఆ శాశ్వత ప్రియుని మార్గము చాలా ప్రమాదకరమైనది. నీ ప్రాణము దక్కాలంటే నువ్వు అహంకారమును మొదట వీడుము.

(5) అనర్హుల వివేకము అతని శాసనపు లోతు వరకు చేరదు. అహంకారమును వీడిన వానికే అతని సన్మార్గము లభిస్తుంది.

(6) పవిత్ర ఖుర్ఆన్‌ను అర్థము చేసుకొను సమస్య ప్రపంచీకులతో పరిష్కారము కాదు. ఆ మద్యమును త్రాగిన వ్యక్తియే ఆ మద్యపు రుచిని తెలుసు కోగలడు.

(7) అంతర జ్యోతుల విషయము తెలియని ఓ వ్యక్తి! మా గురించి నువ్వు ఏమన్నను మేము అసంతృప్తికి గురి కాము.

(8) మేము మేలు కొరకు ఉపదేశ రూపంలో ఈ విషయములను చెప్పాము. తద్వారా ఆ చెడు గాయము దీని ద్వారా మంచిగై పోవును.

(9) దుఆ నిరాకరణకు దుఆతోనే చికిత్స చేయుము. ఎందుకనగా మత్తులో వున్నప్పుడు మద్యపానమునకు మద్యపానము తోనే చికిత్స చేయబడును.

(10) దుఆలలో శక్తి వున్నచో ఆ శక్తిని చూపండని అంటున్న ఓ వ్యక్తి! పరుగెత్తుకుంటు నా వద్దకు రా. నేను సూర్యుని వలె దాని శక్తిని చూపెదను.

(11) జాగ్రత్త! దేవుని శక్తుల రహస్యములను నిరాకరించకు. ఈ విషయమును ఇక్కడితో వదిలి పెట్టు. ఆమోదిత దుఆను నా ద్వారా వీక్షించుము.

దీనిని శ్రద్ధగా చదవండి, ఇందులో మీకు శుభవార్త గలదు

# ప్రభుత్వ అధికారులు, నాయకులు, పాలకులు, ధనికులారా!

بِسۡمِ اللّٰهِ الرَّحۡمٰنِ الرَّحِيۡمِ
نَحۡمَدُهٗ وَنُصَلِّيۡ عَلٰى رَسُوۡلِهِ الۡكَرِيۡمِ

ఓ ఇస్లాం పెద్దలారా! అన్ని వర్గముల కంటే ఎక్కువ అల్లాహ్ తఆలా మీ హృదయములలో సదుద్దేశములను పుట్టించుగాక! ఈ క్లిష్ట స్థితిలో మీరందరిని అల్లాహ్ తఆలా తన ప్రియమైన ధర్మమునకు నిజమైన సేవకులుగా చేయుగాక! ఇప్పుడు నేను కేవలం అల్లాహ్ ప్రీతి కొరకు ఈ ముఖ్యమైన విషయము మీకు తెలుపుతున్నాను. అనగా ఈ అద్భుత ధర్మమైన ఇస్లాంను పునరుద్ధరించుటకు అల్లాహ్ తఆలా ఈ పదునాల్గవ శతాబ్దపు ఆరంభములో తన తరపున నన్ను పంపెను. తద్వారా ఈ అంధకార కాలములో పవిత్ర ఖుర్ఆన్ విశిష్టతలు, హ్రజత్ ముహమ్మద్ దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం వైభవములను ప్రత్యక్షపరతును. అల్లాహ్ తఆలా నాకు ప్రసాదించిన కాంతులు, శుభములు, మహిమలు, దైవామోదిత జ్ఞానముల సహాయముతో ఇస్లాంపై దాడులు చేస్తున్న వారికి సమాధానమిత్తును. నిశ్చయముగా ఈ పని 10 సంవత్సరముల నుండి అద్భుతంగా జరుగుతుంది. కాని ఇస్లాం ప్రచారము కొరకు మేము చేపడుతున్న చాలా పనులకు పెద్ద మొత్తములో ఆర్థిక సహాయముల అవసరమున్నది. కావున మీరందరికి సమాచారము అందించుట అనివార్య మని నేను భావించాను. అందుకే ఓ గొప్ప నాయకులారా! వినండి!

వైభవోపేతుడైన అల్లాహ్, దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం మార్గములో మాకు ఎదురవుతున్న కష్టములు ఏమనగా ఈ రచనలను లక్షలాది ప్రజలలో వ్యాపింపజేయుటకు ఎంతో పెట్టుబడి అవసరమున్నది. ప్రస్తుతం ఎదురవుతున్న ఇబ్బంది ఏమనగా మొదటగా ఈ పెద్ద పెద్ద ఉద్దేశములకు ఏమాత్రం పెట్టుబడి లేదు. కొందరు ఉత్సహపరులు, ధార్మిక వీరుల ధైర్యము, ★ [6] సహాయముతో ఏదేని పుస్తకము ప్రచురించబడినను అల్ప ఆసక్తి, నిర్లక్ష్యము వలన ఈ పుస్తకపు కొద్ది ప్రతులు తప్ప ఎక్కువ విక్రయించబడవు. దీని అధిక ప్రతులు సంవత్సరాల కొద్ది పెట్టెలలో పడి వుంటాయి లేదా అల్లాహ్ పేరున ఉచితంగా పంచబడతాయి. తద్వారా ధర్మ ప్రచారములో చాలా ఆటంకము కలుగుతుంది. నిస్సందేహంగా మా జమాఅత్ క్రమేణ పెరుగుతూ పోతుంది. కాని ఇప్పటికి ఇస్లాం సేవకు చేపడుతున్న ఒక భాగమును స్వీకరించు స్థాయి గల ధనవంతులు మాలో ఎవరు లేరు. నేను అల్లాహ్ తఆలా తరపున ధర్మ నవీనీకరణ కొరకు పంపబడ్డాను. అందుకే కొందరు ధనవంతులను, రాజులను మా సంస్థలో చేర్చుతానని అల్లాహ్ తఆలా నాకు శుభవార్తనిచ్చి వున్నాడు. నాకు అతడిట్లు తెలిపెను. నేను నీకు శుభము తర్వాత శుభము కలిగింతును. తుదకు రాజులు సైతం నీ వస్త్రముల నుండి శుభమును అన్వేషింతురు. అందుకే నా పనికి సహకరించవలెనని నాయకులు, ధనవంతులకు పిలుపునివ్వాలని నేడు నాకు ఆలోచన కలిగెను.

ఈ ధార్మిక సహాయము చాలా గొప్ప పని. మానవుడు తన

---

★ [6] ధార్మిక వీరుల ధైర్యమనగా ఇచట మా సోదరుడు హజ్రత్ మౌల్వీ హకీమ్ నూరుద్దీన్ భైరవీగారని అర్థము. వారు తమ మొత్తం ధనమును ఇదే మార్గములో వినియోగించిరి. వారి తర్వాత నా హృదయపూర్వక మిత్రుడు హకీమ్ ఫజ్లుద్దీన్ గారు, నవాబ్ ముహమ్మద్ అలీ ఖాన్ గారు మాలియర్ కోట్ల, ఇలాగే ఒకరి తర్వాత మరొకరు ఈ మార్గములో సమర్పిస్తున్న వినమ్రులైన మిత్రులున్నారు. **(సమాప్తం)**

సందేహాలు, అనుమానాలు, అపోహలకు అతీతుడు కాదు. సత్యమును గుర్తించనిదే ఇంతటి పెద్ద మొత్తములో సహాయము చేయుటకు ధైర్యము కలుగదు. అందుకే ధనవంతులందరికి బహిరంగ ప్రకటన రూపంలో ఇట్లు వ్రాస్తున్నాను. పరీక్షించనిదే ఈ రకంగా సహాయము చేయుటకు వారు వెనుకడుగు వేస్తున్నచో తమ కొన్ని ఉద్దేశములు, పనులు, కష్టముల గురించి నాకు వ్రాసి పంపండి. వారి ఉద్ధేశములు నెరవేరుటకు నేను వారి కొరకు దుఆ చేయుదును. కాని వారి లక్ష్యములు నెరవేరిన తర్వాత ఎంత వరకు వారు ఇస్లాం మార్గములో మాకు ఆర్థికంగా సహకరిస్తారో ముందుగానే స్పష్టంగా వ్రాయవలెను. ఇటువంటి ఉత్తరము ★ [7] ఎవరైనా వ్రాసి నాకు పంపినచో నేను అతని కొరకు దుఆ చేయుదును. మార్చలేని దైవ నిర్ణయము కానిచో అల్లాహ్ తఆలా తప్పక నా దుఆను ఆమోదిస్తాడని, నాకు సువార్తవాణి ద్వారా ముందస్తు సమాచారం అందిస్తాడని నేను నమ్ముతున్నాను. మా లక్ష్యములు చాలా క్లిష్టమైనవని మీరు నిరాశ చెందకండి. ఎందుకనగా అల్లాహ్ తఆలాకు ప్రతి వస్తువు మీద అధికారము గలదు. కాని శాశ్వత సంకల్పము అందుకు ఆటంకము కాకూడదు. ఇటువంటి వినతి పత్రములు అధిక సంఖ్యలో వచ్చినచో ఎవరి బాధ తొలగించబడునని వైభవోపేతుడైన అల్లాహ్ తఆలా శుభవార్తనిచ్చునో వారికి మాత్రమే సమాచారము అందించబడును. ఈ విషయములు వ్యతిరేకుల కొరకు కూడ సంకేతమగును. బహుశా ఇటువంటి సంకేతములు అధికమై కాలువ రూపంలో ప్రవహించును. ముగింపులో నేను ప్రతి ముస్లింకు ఉపదేశమందిస్తు తెలుపునదేమనగా ఇస్లాం కొరకు

---

★[7] ఉత్తరము ఎంతో జాగ్రత్తగా రిజిస్ట్రీ పోస్టు ద్వారా నాకు పంపవలెను. ఈ రహస్యమును ముందుగానే బహిర్గతపరచకూడదు. మా వద్ద కూడ న్యాసముగా భావించి ఎంతో గోప్యముగా వుంచబడును. ఉత్తరము వ్రాసే బదులు ఎవరైనా నమ్మకమైన ప్రతినిధిని పంపినచో మరింత ఉత్తమముగా భావించబడును. **(సమాప్తం)**

నిద్రను వీడండి. ఇస్లాం తీవ్ర సంకటములో వున్నది. ఇప్పుడిది నిస్సహాయ స్థితిలో వున్నది. కావున దీనికి సహకరించండి. ఇందుకే నేను అవతరించ బడ్డాను. నాకు అల్లాహ్ తఆలా పవిత్ర ఖుర్ఆన్ జ్ఞానము ప్రసాదించెను. తన గ్రంథములోని రహస్య విజ్ఞానములను నాకు నొసంగెను. మహిమలు నాకు ఇవ్వబడెను. ఆ వరము నుండి భాగము పొందుటకు నా వద్దకు రండి. నన్ను అల్లాహ్ తఆలా పంపినాడని నేను అల్లాహ్ ప్రమాణముగా తెలుపుతున్నాను. ఇటువంటి ఘోరాతి ఘోరమైన కుట్రల శతాబ్ది ఆరంభములో స్పష్టమైన ఆపదలను ఎదుర్కొనుటకు బహిరంగ ప్రకటనతో ఒక ముజద్దిద్ (సంస్కర్త) తప్పక రాకూడదా! త్వరలోనే నా పనుల వలన నన్ను మీరు గుర్తింతురు. అల్లాహ్ తఆలా తరపున అవతరించిన వ్యక్తి కాలపు విద్యావంతుల అపోహలే ఆటంకముగా నిలిచెను. తుదకు అతడు తన పనుల వల్లనే గుర్తించబడెను. చేదు వృక్షము తియ్యని ఫలములను అందించలేదు. అల్లాహ్ తన ప్రత్యేక దాసులకు ప్రసాదించు శుభములను ఇతరులకు ఇవ్వడు. ఓ ప్రజలారా! ఇస్లాం చాలా బలహీనమైనది, ధర్మ శత్రువులు నలు వైపుల దీనిని చుట్టుముట్టినారు. విమర్శలు మూడు వేల కంటే ఎక్కువైనవి. ఇటువంటి తరుణంలో సానుభూతితో తమ విశ్వాసము ను ప్రదర్శించండి. దేవుని వీరులలో చేరండి. సన్మార్గమును అవలంభించు వారికి శాంతి ఆశీస్సులు కలుగుగాక!

**(పారసీక పద్యపు అనువాదము)**

(1) అహ్మద్ ధర్మము నిస్సహాయ స్థితిలో వున్నది, దీనిని ఓదార్చు వారెవరు లేరు. ప్రతి ఒక్కరు తమ తమ పనిలో నిమగ్నమై వున్నారు. అహ్మద్ ధర్మముతో వీరికి ఎలాంటి సంబంధము లేదు.

(2) దుర్మార్గ వరదలో నలు వైపుల నుండి లక్షలాది మంది కొట్టుకు పోయారు. ఇప్పటికి మేలుకోని నేత్రముపై విచారము.

(3) ఓ ధనికులారా! ఇంత నిర్లక్ష్యమెందుకు? మీరే నిద్ర మత్తులో వున్నారా లేక ధర్మ అదృష్టము నిద్రలోకి జారుకుందా!

(4) ఓ ముస్లిములారా! అల్లాహ్ కొరకు ధర్మము వైపు ఒక సారి చూడండి! నేను చూస్తున్న ఆపదలను ప్రత్యేకంగా చెప్పవలసిన అవసరం లేదు.

(5) ఓ వీరులారా! లేవండి! దీని దుస్తులు అగ్నికి ఆహుతి అవుతున్నవి, దీనిని దూరము నుండే దర్శించుట ధర్మాచారుల పని కాదు.

(6) నా హృదయము అనుక్షణం ధర్మము కొరకు తల్లడిల్లుతుంది, మా ఈ బాధను అల్లాహ్ తప్ప మరెవ్వరు అర్థము చేసుకోవడం లేదు.

(7) మాకు కలుగుతున్న దుఃఖమును అల్లాహ్ తప్ప మరెవరు తెలుసు కోగలరు. మేము విషము త్రాగుతున్నాము, మాట్లాడే శక్తి మాకు లేదు.

(8) ప్రతి ఒక్కరు తమ భార్యాపిల్లలను ఓదార్చుతున్నారు, కాని నిస్సహాయ ధర్మమును ఎవరు ఓదార్చడం లేదు.

(9) కర్బలా (మైదానము)లోని హతుల వలె ధర్మము హతమగుతున్నట్లు నేను చూస్తున్నాను. కాని ఆ ప్రియుని పట్ల ఎవరికి అభిమానము లేనందుకు విచారము.

(10) స్వంత పనులలో వీరు ప్రదర్శిస్తున్న దాతృత్వమును చూసినప్పుడు నేను ఆశ్చర్యానికి లోనవుతాను, ఎందుకనగా దైవ మార్గములో వీరు

దాన గుణము, దాతృత్వమును ప్రదర్శించరు.

(11) ధర్మమునకు సహకరించు స్థోమత కలిగి, సంకల్పము కలిగి వున్న వ్యక్తి! నీకు సాధ్యమైనంత వరకు సహకరించుము, అల్పము, అధికమని భావించకుము.

(12) అసమర్థుల దౌర్జన్యము వలన అదెలా మట్టిలో కలిసిపోతుందో చూడుము! ఆకాశము క్రింద ఈ ధర్మమునకు సాటి మరొకటి లేదు.

(13) ఈ ఆపద సమయములో మా లాంటి నిరుపేదలు ఉదయం దుఆ చేయడం, తెల్లారకముందు రోధించడం మాత్రమే చేయగలము.

(14) సర్వాధికారి అయిన ఓ అల్లాహ్! ఈ అహ్మద్ ధర్మమును పట్టించుకోని ఈ అంధ మనస్కుణ్ణి ఎన్నడు సంతోష పెట్టకుము.

(15) ఈ ఐశ్వర్యము, మనోహర రోజులు తక్కువగానే వుంటాయి. తోట, పుష్పముల ఈ వసంత కాలపు అలంకరణ ఎల్లప్పుడు వుండదు.

ఇట్లు

మిర్జా గులాం అహ్మద్

ఖాదియాన్, జిల్లా: గుర్దాస్‌పూర్, పంజాబ్

## ఆయీనా కమాలాతె ఇస్లాం (పుస్తక) అభిమానులకు సమాచారము

'ఆయీనా కమాలాతె ఇస్లాం' (ఇస్లాం విశిష్టతల సంకలనం) పేరుతో నేనొక పుస్తకమును రచించాను. ఇందులో ఎంతో లోతుగా పరిశోధించిన తర్వాత ఇస్లాం, పవిత్ర ఖుర్ఆన్ విశిష్టతలు, ప్రత్యేకతలను ప్రస్తావించితిని. ఇంతేకాక మతముల వ్యతిరేకుల బూటకపు విశ్వాసముల ను ఖండించడం కూడ జరిగెను. ఇలాగే ప్రకృతి మతాచారకుల బూటకపు అభిప్రాయములను ఎంతో చక్కగా రద్దు చేయబడెను. దీని పుటలు ఆరు వందల యాభై కంటే ఎక్కువే వున్నాయి. ధర మాత్రం రెండు రూపాయలే. తపాలా ఖర్చులు అదనంగా చెల్లించవలసి యుండును. దీనికి తోడుగా ఇంకా మా వద్ద ఫత్‌హె ఇస్లాం, తౌజీహ్ మరామ్, ఇజలా ఔహామ్ అనే పుస్తకములు కూడ వున్నాయి. ఇంతకు ముందు ఫత్‌హె ఇస్లాం, తౌజీహ్ మరామ్ ధర ఎనిమిది, ఎనిమిది అణాలుండెను. కాని ఇప్పుడు మేము నాలుగు నాలుగు అణాలను తగ్గించాము.

ప్రకటనకర్త
మిర్జా గులాం అహ్మద్
ఖాదియాన్, జిల్లా: గుర్దాస్‌పూర్, పంజాబ్

بسم الله الرّحمن الرّحیم
اللھم صل علی محمد و آل محمد افضل الرسل و خاتم النبیین

# ప్రకటన పత్రము

సువార్తవాణి పొందువానిగా, అవతారునిగా అల్లాహ్ తఆలా తరపున అవతరించిన స్థాయిలో నేను బరాహీనె అహ్మదియ్యా అను పుస్తకమును ధర్మ పునరుద్ధరణ, సంస్కరణ ఉద్దేశముతో రచించాను. దాని సారాంశము ఇట్లు గలదు. మానవుడు అల్లాహ్ తఆలాను అన్ని రకాల లోపములు, తప్పిదములకు అతీతునిగా, పవిత్ర, సంపూర్ణ గుణము లతో హృదయ పూర్వకంగా అతనిని నమ్ముటకు అల్లాహ్ తఆలా తరపున, సత్యమైన ధర్మము అవసరముండును. ప్రపంచములో ప్రస్తుతం అలాంటి ధర్మము ఇస్లాం మాత్రమే వున్నది. ఇందులో సత్యపు శుభములు సూర్యుని వలె ప్రకాశిస్తున్నవి. సత్యపు జ్యోతి పగలు వలె ప్రత్యక్షమవుతుంది. ఇతర మతములన్ని సత్యదూరమైనవి. వివేక పరిశోధనలతో వాటి సూత్రములు సరియైనవి, సత్యమైనవిగా రుజువు కాలేవు. వాటిని అనుసరించడంతో ఆధ్యాత్మిక శుభములు, దైవామోదము కూడ లభించదు. ఇంతేకాక వాటిని అనుసరించడంతో మానవుడు అంతరంగికంగా క్షీణ దశకు చేరును, హృదయములో అంధకారము అలుముకొనును. దాని దుష్టత్వపు గుర్తులు ఇదే ప్రపంచములో ప్రత్యక్షమవుతాయి.

ఈ పుస్తకములో ఇస్లాం ధర్మ సత్యము రెండు రకాలుగా నిరూపించబడెను. **(1) ప్రథమం:** మూడు వందల గట్టి, శక్తివంతమైన వివేకముతో కూడిన నిదర్శనములు గలవు. ఎవరేని ఇస్లాం వ్యతిరేకుడు

ఆయా నిదర్శనములను రద్దు చేసినచో అతనికి పది వేల రూపాయలు బహుకరించబడునని అందులో ప్రకటించబడెను. వాటి గొప్ప స్థాయి, వైభవము ఇట్లు స్పష్టమగుతుంది. తమ సంతృప్తి కొరకు ఎవరైనా సరే న్యాయస్థానములో ఈ విషయమును రిజిస్టిరి చేసుకోవచ్చును. **(2) ద్వితీయ:** ఒక నిజమైన ధర్మ సత్యమును నిరూపించుకొనుటకు అవసరమున్న ఆకాశ సంకేతములు కూడ గలవు. ఈ రెండవ విషయమును ప్రస్తావిస్తు రచయిత అయిన నేను ఇస్లాం సత్యమును సూర్యుని వలె ప్రకాశింపజేయుటకు మూడు రకాల సంకేతములను నిరూపించి చూపాను. **(1) ఒకటి:** మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం కాలములో వ్యతిరేకులు స్వయంగా దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం హస్తమున, వారి దుఆ, శ్రద్ధ, అనుగ్రహముతో మహిమలను తిలకించిరి. వాటి రచయిత అను నేను చరిత్రపరంగా ఒక ఉన్నత స్థాయి సాక్ష్యములతో ప్రత్యేక, విభిన్న రీతిలో ఈ పుస్తకములో రచించాను. **(2) రెండవది:** పవిత్ర ఖుర్ఆన్‌లో స్వతహాగా శాశ్వత, సదా, సాటిలేని విధంగా శుభములు గలవు. వాటిని రచయిత ఎంతో అద్భుతంగా, సరిపడు రీతిలో అన్ని వర్గాలకు చెందిన ప్రతి ఒక్కరి కొరకు స్పష్టముగా వివరించాను. ఎవరికి ఎటువంటి సాకును వెతికే అవకాశము ఇవ్వలేదు. **(3) మూడవది:** అల్లాహ్ గ్రంథమును అనుసరించడం వలన, మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం అడుగుజాడలలో నడుచు వ్యక్తికి వారసత్వముగా లభించే సంకేతములను ఈ దైవ దాసుడు సర్వశక్తిమంతుడైన అల్లాహ్ తఆలా కృపానుసారము ఎంతో చక్కగా నిరూపించి చూపినాడు. ధర్మ సేవకుడనైన నా అనుభవములోకి వచ్చిన అనేక సత్యమైన సువార్తవాణీలు, మహిమలు, అద్భుతములు, పరోక్ష వార్తలు, దైవ ప్రసాదిత జ్ఞానములు, సత్య స్వప్నములు, ఆమోదిత దుఆలను ఈ పుస్తకములో పొందుపర్చినాను. వీటి సత్యముపై మా మత వ్యతిరేకులైన (ఆర్యులు మొదలగు వారు) ప్రత్యక్ష సాక్షులుగా వున్నారు. రచయిత ఈ

కాలపు ముజద్దిద్ (సంస్కర్త) అని తెలుపబడెను. ఆధ్యాత్మికంగా అతని విశిష్టతలు మరియమ్మ కుమారుడైన మసీహ్ విశిష్టతలను పోలి వుండును. ఒకరికి మరొకరితో చాలా దగ్గరి, గట్టి పోలిక వున్నందున, సర్వోత్తమ మానవుడైన, ఉత్తమ ప్రవక్త అయిన సల్లల్లాహు అలైహి వ ఆలిహి వసల్లం అనుసరణ వలన గతించిన అనేక గొప్ప మిత్రులపై అతనికి ప్రాముఖ్యత ఇవ్వబడెను. మహా ప్రవక్త సల్లం అడుగు జాడలలో నడుచుట వలన మోక్షము, సత్కారము, అనుగ్రహము లభించును, అందుకు భిన్నంగా నడుచుకొనుట వలన కోల్పోవడం తప్ప మరేమియును లభించదను సాక్ష్యములన్నియు ఈ పుస్తకమును చదవడంతో స్పష్టమగును. దాని మూడు వందల భాగములలోని సుమారు 37 భాగములు ఇప్పటికే ముద్రించబడినవి. సత్యాన్వేషులకు పూర్తి సంతృప్తి కలిగించుటకు రచయిత స్వయంగా అనుక్షణం సిద్ధముగా వున్నాడు. ఇది అల్లాహ్ తఆలా అనుగ్రహము. తాను కోరిన వారిని అతడు అనుగ్రహిస్తాడు, కాని నాకు గర్వము లేదు. సన్మార్గమును అవలంభించు వానిని అల్లాహ్ తఆలా కరుణించుగాక! ఈ ప్రకటన పత్రము తర్వాత కూడ ఎవరైనా సత్యాన్వేషుల రూపంలో తమ సందేహాల నివృత్తి కొరకు సహృదయముతో హాజరు కానిచో మా తరపున మా బాధ్యత ముగిసినది. అల్లాహ్ తఆలా ఆస్థానము లో అటువంటి వారు సమాధానము ఇవ్వవలసి వుండును. చివరికి ఈ దుఆతో నేను ఈ ప్రకటన పత్రమును ముగిస్తున్నాను. ఓ పవిత్రమైన అల్లాహ్ తఆలా! అన్ని జాతుల పుణ్య మనస్కులకు సన్మార్గము ప్రసాదించుము, తద్వారా వారు నీ ఆమోదిత ఉత్తమ ప్రవక్త ముహమ్మద్ ముస్తఫా సల్లల్లాహు అలైహి వసల్లం, నీ సంపూర్ణ, పవిత్ర ఖుర్ఆన్‌ను విశ్వసింతురు గాక, వారి ఆదేశములను పాటింతురు గాక, సత్యమైన ముస్లిమునకు ఇహ పరలోకములో లభించే సంపూర్ణ అనుగ్రహములు, శుభములు, సత్కార్యములు, స్వచ్ఛమైన ఆనందములు వారందరికి

లభించుగాక, నిజమైన సత్యమూర్తులకు పరలోకములోనే కాక ఇహ లోకములోనే లభించు శాశ్వత మోక్షము, జీవితమును వారు పొందుదురు గాక, ప్రత్యేకంగా ఆంగ్ల జాతీయులు ఇప్పటి వరకు ఆ సత్య సూర్యుని కాంతిలోని ఏ మాత్రం కాంతిని పొందలేదు, వీరి మంచి, నాగరిక, కరుణామయ ప్రభుత్వము మాతో తమ ఉపకారములతో, మిత్రుత్వ విధానముతో వ్యవహరించెను. కావున ఇది మనస్ఫూర్తిగా వారికి కృతజ్ఞతలు తెలుపుటకు మాలో ఉత్సాహము కలిగించెను. తద్వారా వారి ఎర్రటి, తెల్ల ముఖములు ఇహలోకములో అందముగా వున్నట్లే పరలోకము లో కూడ కాంతితో ప్రకాశించుగాక! కనుక మేము ఇహ పరలోకములో వారి మేలును అల్లాహ్ తఆలాతో యాచిస్తున్నాము. ఓ అల్లాహ్! నీ ఆత్మతో వారికి సహకరించుము, నీ ధర్మములో వారికి పెద్ద భాగము అందించుము! వారు నీ గ్రంథమును, నీ ప్రవక్తను విశ్వసించుటకు నీ శక్తితో వారిని ఆకర్షించుము! తద్వారా వారు తండోపతండాలుగా అల్లాహ్ ధర్మములో ప్రవేశింతురు గాక! ఆమీన్, సుమ్మ ఆమీన్, సకల లోకాల సంరక్షకునికే సకల సంకీర్తనములు.

ప్రకటనకర్త
భవదీయుడు
మిర్జా గులాం అహ్మద్
ఖాదియాన్, జిల్లా: గుర్దాస్‌పూర్, పంజాబ్ రాష్ట్రము

(ఇరవై వేల ప్రకటన పత్రములు ప్రచురించబడెను)

**ముద్రణాలయము**: రియాజ్ హింద్ ప్రెస్ అమృత్సర్ పంజాబ్

## TRANSLATION OF THE VERNACULAR NOTICE ON REVERSE

Being inspired and commanded by God, I have undertaken the compilation of a book named" Barahin-i-Ahmadia," with the object of reforming and reviewing the religion, and have offered a reward of Rs. 10,000 to any one who would prove the arguments brought forward therein to be false. My object in this Book is to show that only true and the only revealed religion by means of which one might know God to be free from blemish, and obtain a strong conviction as to the perfection of His attributes is the religion of Islam, in which the blessings of truth shine forth like sun, and the impress of veracity is as vividly bright as the day-light. All other religions are so palpably and manifestly false that neither their principles can stand the test of reasoning nor their followers experience least spiritual edification. On the contrary those religions so obscure the mind and divest it of discernment that signs of future misery among the followers become apparent even in this world.

That the Muhammadan religion is the only true religion has been shown in this book in two ways: (1st), By means of 300 very strong and sound arguments based on mental reasoning (their congency and sublimity being inferred from the fact that a reward of Rs. 10,000 has been offered by me to any one refuting them, and from my further readiness to have this offer registered for the satisfaction of any one who might ask for it):

(2) From those Divine signs which are essential for the complete and satisfactory proof of a true religion. With a view to establish that Muhammadan religion is the only true religion in the world, I have adduced under this latter head 3 kinds of evidences: (1) The miracles performed by the Prophet during his life time either by deeds or words which were witnessed by people of other persuasions and are inserted in this book in a chronological order (based on the best kind of evidences): (2), The marks which are inseparably adherent in the Al-Quran itself, and are perpetual and everlasting, the nature of which has been fully expounded for facility of comprehension (3), The signs which by way of inheritances devolve on any believer in the Book of God and the follower of the true Prophet. As an illustration of this, I, the humble creature of God, by His help have clearly evinced myself to be possessed of such virtues by the achieving of many unusual and supernatural deeds by foretelling future events and secrets, and by obtaining from God the objects of my prayers to all of which many persons of different persuasions like Aryas, & c., have been eye-witness ( A full description of these will be found in the said book).

I am also inspired that I am the Reformer of my time, and that as regards spiritual excellence, my virtues bear a very close similarity and strict analogy to those of Jesus Christ, in the same way as the distinguished chief of Prophets were assigned a higher rank than that of other Prophets, I also by virtue of being a follower of the August Person (the benefactor of mankind, the best

of the messangers of God) am favoured with a higher rank than, that assigned to many of the Saints and Holy Personages preceding me. To follow my footsteps will be a blessing and the means of salvation whereas any antogonism to me will result in estrangemen and disappointment. All these evidences will be found by perusal of the book which will consist of nearly 4800 pages of which about 592 pages have been published. I am always ready to satisfy and convince any seeker of truth. "*All this is a Grace of God He gives it to whom-soever, He likes and there is no bragging in this*." "Peace be to all the followers of righteousness!"

If after the publication of this notice any one does not take the trouble of becoming earnest enquirer after the truth and does not come forward with an unbiassed mind to seek it then my challenging (discussion) with him ends here and he shall be answerable to God.

Now I conclude this notice with the following prayer: Oh Gracious God! guide the pliable hearts of of all the nations, so that they may have faith on Thy chosen Prophet (Muhammad) and on Thy holy Al-Quran, and that they may follow the commandments contained therein, so that they may thus be benifitted by the peace and the true happiness which are specially enjoyed by the true Muslims in both the worlds, and may obtain absolution and eternal life which is not only procurable in the next world, but is also enjoyed by the truthful and honest people even in this world. Expecially the English nation who have not as yet availed themselves of the sunshine of truth, and whose civilized, prudent

and merciful empire has, by obliging us numerous acts of kindness and friendly treatments, exceedingly encouraged us to try our utmost for their numerous acts of welfare, so that their fair faces may shine with heavenly effulgence in the next  We beseech God for their well being in this world and the next. Oh God! guide them and help them with Thy grace, and instil in their minds the love for Thy religion, and attract them with Thy power, so that they may have faith on Thy Book and prophet, and embrace Thy religion in groups Amen! Amen!"

"Praise be to God the supporter of creation!"

(Sd) MIRZA GULAM AHMAD

*Chief of Qadian, District Gurdaspur,*

*Punjab, India*